J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 12

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS




# లాయర్

సంపుటి : 43 సంచిక : 26 01.12.2023, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

## ఆడుదాం... అంటున్న ఆంధ్రలో

# ఆట మొదలయ్యిందా?



'ఆడుదాం ఆంధ్ర'... యువతని ఆకర్షించడం కోసం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నిర్వహిస్తున్న కొత్త పథకం ఇది. *27* జిల్లాలలో, *680* మండలాలలో వివిధ క్రీడా విభాగాలలో పోటీలు నిర్వహించి భారీ నజరానాలు అందించడానికి ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. 'ఆడుదాం ఆంధ్ర'లో పాల్గొనదలచిన వారినుండి దరఖాస్తులు స్వీకరించే ప్రక్రియకి కూడా నవంబర్ *27* నుండి శ్రీకారం చుట్టింది. డిసెంబర్ *15, 2023*వ తేది నుండి ఫిబ్రవరి *3, 2024* వరకూ ఈ 'ఆట'లు కొనసాగుతాయి. అప్పటికి ఎన్నికల నోటిఫికేషన్ వచ్చినా రావచ్చు. అయితే, ఆంధ్రలో ఈ ఆటలతో పాటు 'పొలిటికల్ గేమ్' కూడా మొదలయిందని రాజకీయవర్గాలు అంటున్నాయి. అదే *27* జిల్లాలలో, *680* మండలాలలో జరగబోయే ఎన్నికలకి ఈ ఆటలు రిహార్సల్స్‌గా విశ్లేషకులు భావిస్తున్నారు.

- జగన్ బెయిలుపై సుప్రీం నోటీసులు
- మొదలుకానున్న బాబు పర్యటనలు
- స్పీడు పెంచిన పురందేశ్వరి
- కొలిక్కిరాని టీడీపీ, జనసేన ఉమ్మడి కాపురం
- తెలంగాణ ఫలితాలను బట్టి ఆంధ్ర భవిష్యత్తు!

స్కిల్ స్కామ్‌లో చంద్రబాబు అరెస్టు, ఆ తరువాత 52 రోజులకే బెయిలు వంటి ఉదంతాలు ఆంధ్రప్రదేశ్ రాజకీయాలలో కీలక మలుపులకి కారణమవుతున్నాయా...? అరెస్టు తరువాత జరిగిన పరిణామాలు, బెయిలు వచ్చిన తరువాత జరుగుతున్న సంఘటనలు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని ఇరుకున పెడుతున్నాయా...? జగన్ బెయిలు రద్దు చేయాలంటూ సుప్రీం కోర్టును ఆశ్రయించిన నరసాపురం పార్లమెంటు సభ్యుడు రఘురామరాజు అభ్యర్ధన జగన్ మోహన్‌రెడ్డిని సందిగ్ధంలో పడేస్తుందా?

10లో



జననం: 05.08.1957 నిర్యాణం : 25.11.2023

## ఉత్తరక్రియలు

ప్రతిభాశాలి, సౌమ్యశీలి
ఆతిథ్య రంగంలో సంచలనాలు సృష్టించిన ధీశాలి
మానవీయ విలువలున్న స్నేహశీలి

### శ్రీ అల్లారెడ్డి రవికుమార్‌రెడ్డి గారు

(S/o లేట్ అల్లారెడ్డి శ్యామసుందరరెడ్డి)
తే.25.11.2023ది శనివారం స్వర్గస్థులైనారు.

**ఆ సౌమ్యమూర్తి ఆత్మ శాంతికై ప్రార్థిస్తూ...**

భార్య: అల్లారెడ్డి ప్రియంవదరెడ్డి

కుమారుడు - కోడలు
అల్లారెడ్డి తరుణ్‌రెడ్డి - ప్రత్యూష

కుమార్తె : అల్లారెడ్డి శ్రావ్యరెడ్డి

వదిన : అల్లారెడ్డి సీనారెడ్డి

అన్న కుమార్తెలు - అల్లుళ్ళు
ఎ.నివృతిరెడ్డి - హర్షస్కంద సుందరం
ఎ.రితికరెడ్డి - భీష్మకుమార్

THE SAVERA CHENNAI
Amaravathi Andhra Food at its traditional best

**ఉత్తరక్రియలు**
వారి ఉత్తరక్రియలు తేది 07.12.2023
గురువారం మధ్యాహ్నం 12 గంటలకు
నెం.146, డా. రాధాకృష్ణన్ రోడ్డు, మైలాపూర్, చెన్నైలోని
సవేరా హోటల్, సమావేశ మందిర్‌లో
జరుగును. కావున తెలియజేయడమైనది.

## ఫుట్‌బాల్ క్రీడాకారిణికి..

# ఆనం అరుణమ్మ అభినందన



నెల్లూరు జిల్లా పరిషత్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉన్న షాకీర్ కుమార్తె సుమయ ముస్కానా ఫుట్‌బాల్ క్రీడలో బాగా రాణిస్తూ, ఇటీవల జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావడంతో జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ ఆ క్రీడాకారిణిని నవంబరు 25న నెల్లూరు జడ్పీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో అభినందించారు. ముస్కానా జాతీయ పోటీల్లోనూ సత్తాచాటి జిల్లాకు మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ మాజీ ఛైర్మెన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, జడ్పీ సీఇఓ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

# అనారోగ్య బాధితునికి..రూ. 5 లక్షల సాయం



కందుకూరు మండలం కోవూరు గ్రామానికి చెందిన గోళ్ల శేషయ్య అనారోగ్యానికి గురై వైద్యచికిత్సలకు ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో ఆయన వైద్యానికి సీఎం సహాయనిధి నుంచి రూ 5లక్షల రూపాయలు మంజూరైంది. ఆ చెక్కును ఇటీవల కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ గ్రామ సర్పంచ్ ఆవుల మాధవరావు పాల్గొన్నారు. తమకు సాయం అందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి, అందుకు సహకరించిన ఎమ్మెల్యే, గ్రామ సర్పంచ్‌లకు బాధిత కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# ఆంధ్రవాల్మీకి.. బ్రహ్మశ్రీ పోలూరు వారు

## ప్రముఖ అవధాని కోట రాజశేఖర్



మహాపండితులు, ఆర్షధర్మ ప్రబోధకులుగా ప్రసిద్ధిచెందిన బ్రహ్మశ్రీ పోలూరు హనుమజ్జానకీ రామశర్మ పాండిత్యం, వారి ఆధ్యాత్మిక రచనలు భావితరాలకు మార్గదర్శకాలని ప్రముఖ అవధాని కోట రాజశేఖర్ అన్నారు. పోలూరు వారి శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని నెల్లూరులో పన్నెండు నెలలపాటు ప్రతినెలా ఒక కార్యక్రమాన్ని నిర్వహించాలన్న సంకల్పంతో, పోలూరు వారి శిష్యులు వేదం రాధాకృష్ణమూర్తి సారథ్యంలో, పద్యకళాపరిషత్ ఆధ్వర్యంలో నవంబరు 28న సాహితీ సభ జరిగింది. నెల్లూరులోని విజయమహల్‌గేటు వద్దనున్న ఆంధ్రసభ గీతామందిరంలో జరిగిన ఈ సభలో ఆయన మాట్లాడుతూ, పోలూరు వారి రచనా వైశిష్ట్యాన్ని వివరించారు. 'ఆంధ్ర వాల్మీకి', 'అభినవ శంభుదాస', 'బ్రహ్మవిద్యాచార్య' వంటి ఎంతో విశిష్టమైన బిరుదులందుకున్న ప్రసిద్ధ పండితునిగా పోలూరు వారు నెల్లూరీయులకు సుపరిచితులేనని, నెల్లూరు విఆర్ కళాశాలలో సంస్కృతాంధ్రశాఖలకు అధ్యక్షునిగా ఉంటూ, భాషాభ్యున్నతికి.. ఆధ్యాత్మికరంగ అభివృద్ధికి ఎంతగానో కృషిచేశారని, ఎందరో విద్యార్థులకు, శిష్యులకు తెలుగుభాష పట్ల, సాహిత్యం పట్ల ఎనలేని అభిమానాన్ని కలిగించారని పేర్కొన్నారు. 'శ్రీ రామాయణం'లోని 24వేల సంస్కృత శ్లోకాలను అనన్యసామాన్యమైన రీతిలో తెలుగులోకి అనువదించి ఆంధ్ర వాల్మీకి బిరుదును పొందడంతో పాటు, రామాయణం గురించిన తన అనేక ఉపన్యాసాలతో కలిపి వెలువరించిన 'శ్రీరామాయణ తరంగిణి' అనే ఉద్గ్రంథం పోలూరు వారి పాండితీ ప్రతిభకు నిదర్శనమన్నారు. శ్రీకృష్ణ తత్వాన్ని, మహత్వాన్ని చాటే 'వాసుదేవ కథాసుధ' వంటి దాదాపు 30 గ్రంథాలను పోలూరు వారు అత్యద్భుతంగా రచించారని పేర్కొంటూ, సుప్రసిద్ధ శ్లోకాలకు వారు రచించిన తెలుగు పద్యానువాద గ్రంథం 'కవీంద్ర వైజయంతి'లోని విశిష్టతలను గురించి ఆయన ఈ సందర్భంగా విశదీకరించారు.

అనంతరం కోట రాజశేఖర్‌ను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. పద్యకళా పరిషత్ అధ్యక్షులు మెట్టు రామచంద్రప్రసాద్ ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ప్రపంచ తెలుగుసమాఖ్య ప్రాంతీయ అధ్యక్షులు నలుబోలు బలరామయ్యనాయుడు, ప్రముఖ సాహితీవేత్తలు, సివికెవిన్ మూర్తి, సూరం చంద్రశేఖరం, బాలసాహితీవేత్త గంగిశెట్టి శివకుమార్, బొగ్గరపు రాధాకృష్ణ, కవయిత్రి గోవిందరాజుల సుభద్రాదేవి, పెద్దసంఖ్యలో సాహిత్యాభిమానులు పాల్గొన్నారు.

## జాతీయ సాఫ్ట్‌బాల్‌కు..

# గురుకులం విద్యార్థిని



ఇటీవల బాపట్లలో జరిగిన ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఇంటర్ డిస్ట్రిక్ట్ సాఫ్ట్‌బాల్ అండర్-19 టోర్నమెంట్‌లో ప్రతిభ కనపరచిన జిల్లాలోని ముత్తుకూరులో ఉన్న డా. బిఆర్ అంబేద్కర్ గురుకులానికి చెందిన సీనియర్ ఇంటర్ విద్యార్థిని డి.శ్రావణి జాతీయస్థాయి పోటీలకు ఎంపికై ప్రశంసాపత్రం అందుకుంది. గురుకులం ప్రిన్సిపాల్ సుజాత, అధ్యాపకులు ఆ విద్యార్థినిని అభినందించారు.

## సాగునీటి వినియోగంపై

# రైతులకు అవగాహన

ఇందుకూరుపేట మండలంలోని కొరుటూరు గ్రామంలో ఇటీవల జిల్లా వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో సాగునీటి వినియోగంపై రైతులకు అవగాహన కలిగించారు. మండల వ్యవసాయ అధికారి రఘునాథరెడ్డి ఆ మేరకు రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించి, వరినారు మడులకు ఏమేరకు నీళ్లు పెట్టుకోవాలో చెప్పారు. నారుమళ్లకు తెగుళ్ళ వంటి సమస్యలు వచ్చినప్పుడు ఏఏ రకాల మందులు వినియోగించాలో సూచించారు. గ్రామ వ్యవసాయ సహాయకులు పెంచలయ్య, మాధవయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఓటు నమోదులో అశ్రద్ధ వద్దు

## ఆర్డీఓ మధులత

యువతీ యువకులు ఓటు నమోదులో అశ్రద్ధ చూపవద్దని, 18 నుంచి 21 సంవత్సరాల లోపు యువతీ యువకులందరూ ఓటు నమోదు చేసుకోవాలని ఆత్మకూరు ఆర్డీఓ మధులత సూచించారు. నవంబరు 25న సంగం తహశీల్దార్ కార్యాలయంలో బీఎల్ఓలతో ఆమె సమావేశమయ్యారు. ఓటు నమోదు విషయంలో బీఎల్ఓలు ఎన్నికల కమిషన్ ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని చెప్పారు. ఓటు నమోదులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. తహశీల్దార్ నాగరాజు, డెప్యూటీ తహశీల్దార్‌లు ప్రవీణ్‌కుమార్, అశోక్‌కుమార్, ఆర్ఐ రాజునారాయణ పాల్గొన్నారు.

## 3 నుంచి.. గుంటూరులో

# వ్యవసాయ సదస్సు

డిసెంబరు 3 నుంచి 5వ తేది వరకు గుంటూరులోని ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో అగ్రిటెక్-2023 వ్యవసాయ సదస్సు జరుగుతుందని నెల్లూరులోని కృషి విజ్ఞానకేంద్రం సమన్వయకర్త డా. జి.లలితాశివజ్యోతి తెలిపారు. వ్యవసాయానికి సంబంధించి అనేక అంశాలను శాస్త్రవేత్తలు, అధికారులు వివరిస్తారని, రైతులు, రైతు మహిళలు, రైతు సంఘాల వారు, ప్రభుత్వేతర సంస్థల వారు, ఇన్‌పుట్ డీలర్లు, అనుబంధశాఖల అధికారులు తదితరులంతా పెద్దసంఖ్యలో పాల్గొని వ్యవసాయ సదస్సును జయప్రదం చేయాలని ఆమె విజ్ఞప్తిచేశారు.

## సీజనల్ వ్యాధుల పట్ల..

# ప్రజలను అప్రమత్తం చేయాలి

## డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ పెంచలయ్య



ప్రస్తుతం చలివాతావరణం వల్ల పెరుగుతున్న సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కలిగించి అప్రమత్తం చేయాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పెంచలయ్య వైద్యసిబ్బందిని ఆదేశించారు. ఇటీవల ఆయన బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని జొన్నవాడలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్యసిబ్బందితో సమావేశమై, ప్రభుత్వాసుపత్రులపై నమ్మకం కలిగేలా సిబ్బంది బాధ్యతగా పనిచేయాలని చెప్పారు. గ్రామంలో దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని, మలేరియా, డెంగ్యూ తదితర వ్యాధుల పట్ల ఎప్పటికప్పుడు ముందస్తుగానే ప్రజలను హెచ్చరించాలని, అవసరమైన వైద్యచికిత్సలు అందించాలని తెలిపారు. గర్భిణులు ప్రభుత్వాసుపత్రుల్లో కాన్పులు చేసుకునేలా అవగాహన కలిగించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ సుబ్బమ్మ, డాక్టర్ అహ్మద్‌బాబు, డాక్టర్ వినయ్‌కుమార్, ప్రత్యూష, సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

# అన్నదాత.. కంచి పరమేశ్వరరెడ్డి దాతృత్వం



ఆత్మకూరులోని సాంబశివా చారిటబుల్ ట్రస్ట్ అధినేత, ప్రముఖ అన్నదాత కంచి పరమేశ్వరరెడ్డి ఆత్మకూరులో వివిధ కారణాలతో మృతి చెందిన పేద కుటుంబాల వారికి, మృతుల అంత్యక్రియల నిమిత్తం 10 వేల రూపాయలు సాయం అందిస్తూ, ఆ కుటుంబాలకు తనవంతు చేయూతనందిస్తున్నారు. నవంబరు 25న ఒక్కరోజే ఆత్మకూరు మునిసిపాలిటీ పరిధిలోని నాలుగు కుటుంబాలకు ఆయన సాయమందించారు. 14వవార్డులో ఖాజావలి కుటుంబానికి, 12వవార్డులోని యు.రామ్మూర్తి, 19వ వార్డులోని నూతలపాటి పెంచలయ్య, 6వవార్డులోని ఎన్.వెంకటేశ్వర్లు కుటుంబాలకు రూ. 10వేల వంతున సాయం అందించారు. ఈ కార్యక్రమంలో కంచి పరమేశ్వరరెడ్డితో పాటు, స్థానిక వైకాపా నాయకుడు కొండా వెంకటేశ్వర్లు, వాగాల శ్రీహరి, మెప్మా ఆర్‌పీలు సమీనా, నాగరాణి, శాంతితో పాటు ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ పోలీసులకు రెయిన్‌కోట్ల వితరణ



ఎండల్లో, వానల్లో విధి నిర్వహణలో ఇబ్బందులు పడుతున్న ట్రాఫిక్ పోలీసులకు కావలిలోని వాసవి క్లబ్ అధ్యక్షుడు కర్నాటి సుబ్బారావు ఇటీవల రెయిన్‌కోట్, ఎండ తగలకుండా టోపీ, టర్కీటవల్స్‌తో కూడిన కిట్‌లను కావలి డీఎస్పీ వెంకటరమణ చేతులమీదుగా అందజేశారు. సోదరభావంతో ఆమేరకు సాయం అందించిన కర్నాటిని డీఎస్పీ అభినందించారు. సీఐలు శ్రీనివాసరావు, సుధాకర్‌రావు, డాక్టర్ పాదర్తి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# జగనన్న ఇళ్లను త్వరగా నిర్మించండి



పేద ప్రజల సొంతింటి కలను నిజం చేసేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న జగనన్న ఇళ్ళ నిర్మాణాలను అధికారులు త్వరితగతిన పూర్తిచేసేందుకు చర్యలు తీసుకోవాలని చేజర్ల మండల పరిషత్ అధ్యక్షుడు తూమాటి విజయభాస్కర్‌రెడ్డి సూచించారు. ఇటీవల ఆయన చేజర్లలో గ్రామస్తులకు నిర్మిస్తున్న జగనన్న ఇళ్లను పరిశీలించారు. అధికారులు ఎప్పటికప్పుడు నిర్మాణాలను పర్యవేక్షించాలని, ఇళ్ళ నిర్మాణాల్లో నాణ్యత ఉండేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట సర్పంచ్ ఆవుల వెంకటేశ్వర్లు, వర్క్ ఇన్స్‌పెక్టర్ నజీర్ తదితరులు పాల్గొన్నారు.

# బడుగు జనులకు అండగా.. సీఎం జగన్

## - నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి



రాష్ట్రంలో దళితులు, బడుగు బలహీనవర్గాల ప్రజలకు అండగా సిఎం జగన్ ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారని, నిరుపేదలకు, అసైన్డ్, సర్వీస్ ఇనామ్ భూముల రైతులకు భారీ మేలు చేసేలా ఇటీవల కీలక నిర్ణయాలు తీసుకున్నారని, తద్వారా భూములకు సంబంధించి గతంలో ఏ ప్రభుత్వం చేయనంత మేలు రైతులకు చేకూరనుందని ఆంధ్ర ప్రదేశ్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ బోర్డు ఛైర్మన్, తిరుపతి జిల్లా వైకాపా అధ్యక్షులు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. నవంబరు 28న రామ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షత న గూడూరు ఆర్డీఓ ఎం.కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో వెంకటగిరిలో జగనన్న శాశ్వత భూహక్కు పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా రామ్ మాట్లాడుతూ దివంగత మహానేత డాక్టర్ వైఎస్సార్ తర్వాత మళ్లీ భూ పంపిణీకి జగన్ సర్కార్ సిద్ధమైందని, 54,129.45 ఎకరాలను భూమిలేని దళిత, బడుగు బలహీన వర్గాలకు చెందిన 46,935 మంది నిరుపేదలకు పంపిణీ చేసేందుకు, అసైన్డ్ భూముల రైతులకు యాజమాన్య హక్కులను కల్పించేందుకు ఇటీవల జరిగిన మంత్రిమండలి సమావేశం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని ఆయన తెలిపారు. 2024 జనవరి నాటికి సంక్రాంతి కానుకగా వేలాదిమంది లబ్దిదారులకు భూపంపిణీ జరుగుతుందన్నారు. అర్హులైన ప్రతిరైతుకు భూములు అందేవిధంగా సీఎం జగన్ చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు.

# సర్వేపల్లిలో అంతా దోపిడీయే

## అక్రమ మైనింగ్‌తో 'క్వార్ట్జ్'ను కాజేస్తున్నారు - సోమిరెడ్డి ధ్వజం



సర్వేపల్లి నియోజకవర్గంలో అక్రమ మైనింగ్‌తో వైకాపా నాయకులు ప్రకృతిని దోచుకుంటున్నారని, కోట్ల విలువైన మైకా బేస్ట్ క్వార్ట్జ్‌ను కొల్లగొడుతున్నారని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు, మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. పొదలకూరు మండలం తాటిపర్తి పంచాయతీలోని వరదాపురంలో వైసీపీ నేతలు అక్రమంగా క్వార్ట్జ్ మైనింగ్ చేస్తున్న ప్రాంతాన్ని జనసేన నాయకులతో కలిసి ఆయన ఇటీవల పరిశీలించారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ, అక్రమ మైనింగ్‌పై ఫిర్యాదులొచ్చినా మంత్రి కాకాణి ఒత్తిడితో జిల్లా అధికారులు చేతులెత్తేయడం సిగ్గుచేటని దుయ్యబట్టారు. సీఎం జగన్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే అక్రమ మైనింగ్‌పై సీబీఐతో విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. అక్రమాలకు పాల్పడిన వారితో పాటు వారికి సహకరించిన ఏ ఒక్కరినీ వదిలిపెట్టడం జరగదని, టీడీపీ ప్రభుత్వం రాగానే ఊచలు లెక్కపెట్టిసామని ఆయన చెప్పారు. జగన్‌రెడ్డి రాజ్యంలో వైసీపీ ఎమ్మెల్యేలు, మంత్రులు, నాయకులు పట్టపగలు బందిపోటుదొంగల్లా ప్రజల సొత్తు అయిన సహజ వనరులను కాజేస్తున్నారని, క్వార్ట్జ్‌కు అనూహ్యంగా మంచి ధర లభించడంతో బరితెగించి దోపిడీకి పాల్పడుతున్నారని ఆయన విమర్శించారు.

ప్రజల సొత్తును అధికారులు కాపాడలేకపోవడం దారుణమని, ఎవడబ్బ సొత్తని వైసీపీ నేతలకు ధారాదత్తం చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం చచ్చిపోయిందని, మైనింగ్ చట్టం జగన్‌రెడ్డి బూటు కాళ్ల కింద నలిగి పోతోందని విమర్శించారు. అక్రమార్కులు ప్రభుత్వ, దేవాదాయ, చెరువు పోరంబోకు భూములను దేనినీ వదలడం లేదన్నారు. నాయకులు బొమ్మి సురేంద్ర, రాష్ట్ర రైతు ప్రధాన కార్యదర్శి రావూరి రాధాకృష్ణమనాయుడు, జనసేన సర్వేపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి బొబ్బేపల్లి సురేష్‌నాయుడు, తలచీరు మస్తాన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



# శ్రీసిటీలో..మలేషియా కాన్సుల్ జనరల్

శ్రీసిటీ పారిశ్రామికవాడ గురించి ప్రత్యక్షంగా తెలుసుకోవడం, వ్యాపార సామర్థ్యాన్ని అంచనా వేయడం, పెట్టుబడి అవకాశాలను అన్వేషించడం ధ్యేయంగా చెన్నైలోని మలేషియా కాన్సుల్ జనరల్ శరవణ కుమార్ కుమారవాసగం, ట్రేడ్ కమిషనర్ వాన్ అహ్మద్ తార్మిజీ వాన్ ఇద్రిస్‌తో కలిసి నవంబరు29న శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ ప్రెసిడెంట్ సతీష్ కామత్ వారికి సాదర స్వాగతం పలుకగా, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (మార్కెటింగ్) శివశంకర్ శ్రీసిటీ ప్రగతి, ప్రత్యేకతలను వివరించారు. మెగా ఇండస్ట్రియల్ పార్క్ అభివృద్ధిలో కాన్సుల్ జనరల్ పర్యటనకు ఎంతో ప్రాముఖ్యత ఉందంటూ శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తన ప్రకటనలో తెలిపారు. అద్భుతమైన పర్యావరణ వ్యవస్థతో కూడిన మంచి పారిశ్రామికవాడగా శ్రీసిటీని కాన్సుల్ జనరల్ ప్రశంసిస్తూ, ఫుడ్ ప్రాసెసింగ్, ఎలక్ట్రానిక్స్ రంగాలలో భారతదేశంలో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి ఉన్న మలేషియా కంపెనీలకు శ్రీసిటీని సిఫార్సు చేస్తానని చెప్పారు.

## విద్యా వ్యవస్థ

# అస్తవ్యస్తమైపోయింది

రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక విద్యా వ్యవస్థ అస్తవ్యస్తపోయిందని, గత నాలుగేళ్లలో 4709 ప్రభుత్వ పాఠశాలలను రద్దుచేశారని, 50 వేల టీచర్ల పోస్టుల భర్తీని అసలు పట్టించుకోవడం లేదని, జగన్ నిర్ణయాలతో వేలాది మంది విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారని టీడీపీ నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ దుయ్యబట్టారు. నవంబరు 27న నెల్లూరులోని టీడీపీ కార్యాలయంలో టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు షేక్ అమ్ముల్లాతో కలిసి 'విద్యార్థీ మేలుకో-భవిష్యత్తు మార్చుకో' పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను రద్దు చేయడంతో రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు రోడ్డునపడ్డారన్నారు.



## గొలగమూడి వద్ద..

# రూ. 48.07 కోట్లతో విద్యుత్ సబ్‌స్టేషన్

- వర్చువల్‌గా ప్రారంభించిన ముఖ్యమంత్రి

వెంకటాచలం మండలం గొలగమూడి సమీపంలో రూ.48.07 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన 132/33 కె.వి విద్యుత్ ఉపకేంద్రాన్ని ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి నవంబరు 28న వర్చువల్‌గా ప్రారంభించారు. గొలగమూడి విద్యుత్ ఉపకేంద్రం నుంచి ప్రారంభోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్, ట్రాన్స్ కో, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి విలేకర్లతో మాట్లాడుతూ, గొలగమూడి, నెల్లూరు రూరల్, సిటీ పరిసర ప్రాంతాల్లోని సుమారు లక్ష మందికి విద్యుత్ అందించేందుకు గొలగమూడి వద్ద, ఇందుకూరుపేట, తోటపల్లి గూడూరు మండలాల ప్రజలకు నిరంతరాయంగా విద్యుత్ అందించేందుకు కొరుటూరు వద్ద 132/33 కేవీ సబ్‌స్టేషన్లు నూతనంగా నిర్మించినట్లు చెప్పారు. ఈ సబ్‌స్టేషన్ల ఏర్పాటు వల్ల భవిష్యత్తులో వ్యవసాయ, పరిశ్రమలు, గృహ అవసరాలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా నాణ్యమైన విద్యుత్‌ను అందించవచ్చన్నారు. రాష్ట్రంలో రూ. 4020 కోట్లతో నిర్మాణాలకు పూర్తిచేసుకున్న 12 నూతన సబ్ స్టేషన్లకు ప్రారంభోత్సవాలు, రూ.2478 కోట్లతో 16 కొత్త సబ్ స్టేషన్ల ఏర్పాటుకు శంకుస్థాపనలు, మొత్తం సుమారు 6,500 కోట్ల విలువైన విద్యుత్ ప్రాజెక్టులకు ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టడం విద్యుత్ రంగంలో ఒక మైలురాయి అని పేర్కొన్నారు. రైతులకు 9 గంటలు పగటిపూట విద్యుత్ అందించాలనే లక్ష్యంతో కోట్లాది రూపాయలు వెచ్చించి సబ్ స్టేషన్ల నిర్మాణం, ట్రాన్స్మిషన్ల విస్తరణ చేపట్టినట్లు చెప్పారు.

# జిల్లాకు తుఫాన్ సూచన

## డిసెంబరు 2 నుంచి ఈదురుగాలులు, భారీ వర్షాలు



బంగాళాఖాతంలో అల్పపీడనం వాయుగుండంగా మారి, దాని ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా భారీవర్షాలు కురువనున్నాయని, జిల్లాలో భారీవర్షాలతో పాటు తుఫాన్ వస్తుందని వాతావరణ శాఖ సూచిస్తోంది. డిసెంబరు 2వ తేదీ నుంచి వారం రోజుల పాటు తుఫాన్ ప్రభావం ఉంటుందని కూడా ముందస్తు తుఫాన్ హెచ్చరికలు వస్తున్నాయి. వాయుగుండం బలపడి నైరుతి బంగాళాఖాతంలో తుఫానుగా మారనుందని బుధవారం రాత్రి తాజాగా భారత వాతావరణశాఖ పేర్కొంది. తుఫాను ప్రభావంతో జిల్లాలో డిసెంబరు 2, 3, 4 తేదీల్లో ఈదురుగాలులతో, భారీ వర్షాలు కురిసే సూచన ఉందని హెచ్చరించారు. రానున్న తుఫాన్ ప్రభావంతో పంటలు దెబ్బతినే అవకాశం ఉందని, ఇతరత్రా ప్రమాదాలు జరగకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. డిసెంబర్ 2న తుఫాన్ రావడం నిర్ధారణ అయితే, దానికి 'మిచాంగ్ తుఫాన్'గా వ్యవహరించనున్నారని సమాచారం.

# ఆన్‌లైన్ మోసాలతో జాగ్రత్త!

## - జిల్లా ఎస్పీ డా.తిరుమలేశ్వరరెడ్డి



ఆన్‌లైన్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా యువత వీటి పట్ల జాగ్రత్త వహించాలని జిల్లా ఎస్పీ డా.కె.తిరుమలేశ్వరరెడ్డి చెప్పారు. నవంబరు 27న నెల్లూరులోని ఉమేష్‌చంద్ర సమావేశమందిరంలో జరిగిన 'స్పందన' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పెద్దపెద్ద సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగాలిప్పిస్తామని నమ్మబలికి, నకిలీ నియామకపత్రాలను అందజేసి, ఆన్‌లైన్‌లో శిక్షణ ఇస్తున్నట్లు మభ్యపెడుతూ లక్షల రూపాయలు వసూలుచేస్తున్న మోసగాళ్ళ వలలో పడవద్దని, వారి మాయమాటలు నమ్మవద్దని సూచించారు. స్పందన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. అనంతరం 'స్పందన'కు వచ్చిన అర్జీదారులకు భోజన సదుపాయం ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు హిమవతి, ప్రసాద్‌తో పాటు పలువురు పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# మాయలమారి 'డీప్ ఫేక్'తో జాగ్రత్త సుమా!

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ప్రపంచవ్యాప్తంగా బాగా విస్తరిస్తుందని సంబరపడడం సంగతటుంచి, ఈ సాంకేతిక మాయల్లోంచి వచ్చే దుష్పరిణామాలను చూసి ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. అసలే సైబర్ మోసగాళ్ళతో వేగలేని దుస్థితి ఒక వైపు ఉంటే, మరోవైపు 'కృత్రిమ మేధ' (ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్-ఏఇ)తో ఉన్నది లేనట్టూ, లేనిది ఉన్నట్టూ చూపుతూ జనాన్ని వెర్రెత్తిస్తున్నారు. మాయగాళ్ళకు, మార్ఫింగ్‌ల ముఠాలకు కొదవలేని నేటి ప్రపంచంలో కొత్తగా 'డీప్ ఫేక్' మోసాలు పుట్టుకొస్తుండడం ప్రపంచ మానవాళిని కలవరపెడుతోంది. మానవాళి అభ్యుదయానికి బాటలు వేయాల్సిన సాంకేతికత వికృతరూపం దాల్చి ఒకరినొకరు అసహ్యించుకునే రీతిలో మార్ఫింగ్‌లకు పాల్పడుతూ, జుగుప్సాకరమైన ప్రక్రియలతో దిగజారిపోతోంది. ముఖం ఒకరిదైతే శరీరం మరొకరిది కావడం, మాట ఒకరిదైతే రూపం ఇంకొకరిది కావడం.. చెప్పుకోవడానికి ఆసక్తిగానే ఉంటుంది కానీ, వాస్తవంలో అవి వ్యక్తుల గౌరవ ప్రతిష్టలను నాశనం చేస్తున్నాయి. సమాజాన్ని పెడదారి పట్టిస్తున్న ప్రమాదకారిగా మారుతోన్న డీప్ ఫేక్‌ను అరికట్టడం ప్రపంచానికి ఒక పెద్ద సవాల్‌గా మారుతోంది. ఈ మాయలమారి బారిన పడుతున్న వారి బాధలు చెప్పనలవి కానన్ని. ఇటీవల, సాక్షాత్తూ ప్రధాని మోడీ ఒక పాట పాడుతున్నట్లు డీప్ ఫేక్ ద్వారా సృష్టించడం దేశప్రజలను అయోమయానికి గురిచేసింది. 'నేనెప్పుడూ పాట పాడలేదే' అని ప్రధానే ఆ వీడియో చూసి విస్తుపోయారంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థమవుతుంది. మహామహులనే అది బురిడీ కొట్టిస్తోంది. ఒక్క మన దేశప్రధానికే కాదు, గతంలో అమెరికా అధ్యక్షుడు జోబైడెన్‌కూ ఈ బాధ తప్పలేదు. రష్యా అధ్యక్షుడు పుతిన్, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ వంటి వారు కూడా డీప్ ఫేక్ మాయలమారి చేతికి చిక్కి నానా యాతనలు పడ్డవారే. తలకాయలు మార్చేసి వేరేవాళ్ళ తలలు పెట్టి, మార్ఫింగ్ చేసే విద్యలో ఆరితేరినవారు ఈ మోసపు చర్యలకు పాల్పడుతున్నారని తెలుస్తోంది. మనదేశంలో ఇటీవలి కాలంలో పలువురు ప్రముఖ సినీ నటీమణులు కూడా డీప్ ఫేక్‌కు గుర్రై ఇబ్బందులు పడిన విషయం తెలిసిందే. 'అసలు మనుషుల' తలలకు

లాయర్
డిసెంబర్ 01, 2023

బదులుగా నకిలీ తలలు అతికించి అసలైనవారిని గందరగోళానికి గురిచేస్తుండడాన్నే పొడి మాటల్లో 'డీప్ ఫేక్' అంటున్నారు. ముఖాలు మార్చేసి, వారి పేరుతో ఆడియోలు వీడియోలు తయారుచేసి, కొందరిని అసభ్యంగా చూపించి, జనం మీదికి ఆ వీడియోలను వదలడం, చేయని పని చేసినట్లు చూపడం..ఎంత ఘోరమో చూడండి. మాట్లాడే మాటలు కూడా అలాగే ఉంటాయి. అవి నిజమో కాదో తేల్చుకోవడం కష్టం. ఓ కొడుకు తండ్రికి ఫోన్ చేసి వెంటనే ఫోన్ పే ద్వారా పలానా నంబరుకి డబ్బు పంపండి నాన్నా అర్జంట్..అంటే ఆ తండ్రి ఆందోళనతో పంపేస్తాడు. కానీ, అది నకిలీ కాల్. కొడుకు గొంతును అనుకరించి మోసపుచ్చిన కాల్ అది. చివరికి తండ్రి కూడా తెలుసుకోలేనంతగా ఉంటుందన్న మాట. ఇలాంటి ప్రమాదాలు ఈ డీప్ ఫేక్ వల్ల బోలెడు. దీంతో మనం ఏరకంగా మోసపోతామో తెలియదు. తెలిసేసరికి అంతా అయిపోతుంది. ఒక్క మాటలో చెప్పాలంటే మనం ఇప్పుడు అందరూ గొప్పగా చెప్పుకునే సాంకేతికయుగంలో కాదు..మోసపు మాయాప్రపంచంలో ఉన్నాం. నిజాలకు ఎప్పుడో కాలం చెల్లిపోయింది. ఏ వీడియోలను, ఎవరి మాటలను, ఏ ఫోటోలను అవి అసలవని నమ్మడానికి లేని కాలం ఇది. ఈ అధునాతన డీప్ ఫేక్‌తో కొత్త ముప్పు ముంచుకొస్తోంది. జాగ్రత్తగా లేకుంటే ఏమైనా జరగొచ్చు అన్నట్లుంది పరిస్థితి. స్మార్ట్ ఫోన్‌లు చేతికి వచ్చాక, అరచేతిలోకి ప్రపంచం వచ్చింది. అయితే, మంచి కంటే రానురాను ఇలాంటి మోసాలు మరీ విపరీతమైపోతున్నాయి. వ్యక్తిగతమైన విషయాల్లో భద్రత అన్నది గగనకుసుమమైపోయింది. ఫోటోలు ఎవరికైనా పంపితే అవి మార్ఫింగ్ కాకుండా ఉంటాయని నమ్మకం ఉండడం లేదు. అసభ్యకరంగా, అశ్లీలంగా మార్చి సామాజిక మాధ్యమాల్లో పెట్టి ఆయా వ్యక్తుల గౌరవాన్ని మంటగలుపుతున్నారు. పర్సనల్ డేటా ఎవరికైనా అందితే, మనకు తెలియకుండానే మన డబ్బు కూడా గల్లంతైపోతుంది. ఈ నేపథ్యంలో, ఎవరి జాగ్రత్తల్లో వారుండడం తప్ప మరో మార్గాంతరం లేదు. స్మార్ట్‌ఫోన్ వాడడంలో మంచి చెడ్డలను ముందుగా తెలుసుకుని, ఎవరి వలలో పడకుండా చూసుకోవాలి తప్ప, మోసపోయాక ఇక చేయగలిగిందేమీ ఉండదు. కేంద్రప్రభుత్వం ఈ మోసపు 'డీప్ ఫేక్'ను నిరోధించేందుకు వెంటనే కొత్త చట్టానికి పదునుపెట్టాలి. వికృత క్రీడగా మారిన ఈ నకిలీల. కల్పితాల మాయాజాలం నుంచి, భయంకర మోసాల బారినుంచి ప్రజల వ్యక్తిగత భద్రతను, గౌరవప్రతిష్టలను కాపాడేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవడం అత్యవసరం.

న్యాయస్థానాలకి భారమవుతున్న

# నేర భారతం

## కోట్లల్లో కేసులు.. వేలల్లో కోర్టులు..!

వాహనం వన్‌వేలో వచ్చినా, రాంగ్ పార్కింగ్ చేసినా, ఓవర్ స్పీడ్ వెళ్లినా కేసే. అదేవిధంగా ఒక వ్యక్తి ఒక్క దొంగతనం చేసినా వెయ్యి దొంగతనాలు చేసినా కేసు ఒక్కటే. నరహంతకుడు ఒకరిని చంపినా వంద మందిని చంపినా కేసే. ఆర్థిక నేరానికి పాల్పడిన ప్రజా ప్రతినిథి లక్ష రూపాయలు సంపాదించినా, లక్ష కోట్లు సంపాదించినా కేసే. పక్క దేశపు ఉగ్రవాదులు మన దేశంపై పడి విచక్షణా రహితంగా కాల్పులు జరిపినా కేసే. భార్యా భర్తల మధ్య గొడవలు, అన్నదమ్ముల మధ్య ఆస్తితగాదాలు, మాన భంగాలు, పరువు నష్టాలు, నీటి గొడవలు, అప్పుల కేసులు... వీటికి తోడుగా ఇటీవల కాలంలో ప్రభుత్వాలకి వ్యతిరేకంగా నమోదవుతున్న ప్రజా ప్రయోజనాల వ్యాజ్యాలు... ఇలా చెప్పకుంటూ పొతే కొన్ని వేల రకాల నేరాలకి సంబంధించిన కేసులతో, వివాదాలతో కోట్లమంది భారతీయులు న్యాయస్థానాలని ఆశ్రయిస్తున్నారు. భారతదేశ న్యాయవ్యవస్థకి ఇప్పటికే ఇదొక పెద్ద సవాలుగా మారిందనడంలో సందేహం లేదు. మారుతున్న ఆధునిక ప్రపంచంలో నేరాల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. అత్యంత శక్తివంతమైన నవ సాంకేతిక పరిజ్ఞానం సెల్‌ఫోన్ రూపంలో అరచేతిలోకి రావడంతో అనేక కొత్త రకాల నేరాలకు అది ప్రేరేపితమవుతోంది. ఇప్పటికే ఏళ్ల తరబడి పెండింగులో ఉన్న పాత కేసులే పరిష్కరించలేక ఇబ్బందిపడుతుంటే, రెట్టింపు సంఖ్యలో పుట్టుకొస్తున్న కొత్త రకాల నేరాల కేసులతో న్యాయ నిపుణులు సతమతమవుతున్నారు.

140 కోట్ల మంది పౌరులున్న అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన మన భారతదేశంలో 2023 జనవరి గణాంకాల ప్రకారం, అప్పటికి వివిధ న్యాయస్థానాలలో పెండింగులో ఉన్న 5 కోట్ల కేసులకి గాను కేవలం 70లక్షల కేసులు మాత్రమే పరిష్కరించబడ్డాయి. అంటే ఆనాటికి ఇంకా 4 కోట్లా 70 లక్షల కేసులు పెండింగులో ఉన్నాయని లెక్కలు చెప్తున్నాయి. ఈ కేసుల్లో 1,69,000 (ఒక లక్షా అరవై తొమ్మిదివేల కేసులు) గడచిన 30 సంవత్సరాలుగా పరిష్కారం లభించకుండా కోర్టుల్లో నానుతున్నాయని కూడా ఆ గణాంకాలు చెప్తున్నాయి.

కేసులు త్వరతగతిన పరిష్కరించడానికి ప్రభుత్వాలు ఎప్పటికప్పుడు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటూనే వున్నాయి. సాధారణ కేసులతో పాటు




కొన్ని కేసులను పలు విభాగాలుగా విడగొట్టి ఆయా విభాగాలకు ప్రత్యేక కోర్టులను ఏర్పాటు చేసి న్యాయమూర్తులను నియమిస్తున్నాయి. ఉదాహరణకి సిబిఐ, ఏసీబీ, సీఐడీ కేసులను వాదించడానికి ప్రత్యేక కోర్టులు ఉన్నాయి. అలాగే ఫ్యామిలీ కోర్టు, ల్యాండ్ గ్రాబింగ్, క్లైములు, లోక్ అదాలత్, పోస్కో(మైనర్ల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక విభాగం), మొబైల్ కోర్టులు... ఇంకా ఇలాంటి అనేక రకాల కోర్టుల ద్వారా ఎప్పటికప్పుడు కేసులు పరిష్కరించడానికి న్యాయ వ్యవస్థ కృషి చేస్తూనే వుంది. కానీ, పాత కేసుల సంఖ్య తగ్గే కొద్దీ అంతకి పదిరెట్లు కొత్త కేసులు కోర్టుల తలుపులు తడుతున్నాయని అంటున్నారు న్యాయ నిపుణులు.

**రాజకీయ జోక్యం ఉండకూడదు...!**

మనదేశంలో న్యాయమూర్తులను ప్రభుత్వాలే నియమిస్తాయి. అత్యున్నత న్యాయస్థానం నుండి అత్యంత క్రింది స్థాయి కోర్టుల వరకు న్యాయమూర్తులను నియమించేది ప్రభుత్వాలు, వాటి పాలకులే. సాధారణ పౌరులకంటే ఎక్కువ స్థాయిలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రజాప్రతినిధులే న్యాయవ్యవస్థలో నియామకాలపై పట్టు కలిగి ఉంటే ఇంక త్వరితగతిన కేసుల పరిష్కారం ఎలా సాధ్యం ...? అన్నది ఇక్కడ ప్రశ్న. ఐఏఎస్, ఐపీఎస్, ఐఆర్ఎస్, ఐటీఎస్ తరహాలో న్యాయ వ్యవస్థలోకూడా "ఇండియన్ జ్యూడిషియల్ సర్వీసెస్"ను ప్రవేశపెట్టి జాతీయస్థాయిలో రాత పరీక్షలు, ఇంటర్వ్యూలు పెట్టి న్యాయమూర్తులను నియమించే సంప్రదాయానికి ప్రభుత్వాలు శ్రీకారం చుట్టాలి. ఇతర దేశాల్లో అత్యంత త్వరతగతిన కేసులు పరిష్కరింపబడడానికి అవలంభిస్తున్న విధానాలను మన దేశంలో కూడా ఆచరించాలి. అవసరమైతే న్యాయస్థానాల సంఖ్యను పెంచాలి. దీర్ఘకాలంగా పరిష్కారం లభించక గత 30సంవత్సరాలుగా లక్షా అరవై తొమ్మిదివేల కేసులు దేశవ్యాప్తంగా పెండింగులో ఉన్నాయంటే, మనదేశంలో పరిస్థితి ఎలా ఉందో మనం ఊహించుకోవచ్చు. ఆ కేసులకు పరిష్కారం లభించేటప్పటికి ఇరు పక్షాలలో వారసులు పోరాడాల్సిందే తప్ప కేసు వేసినవారు, నేరం ఆరోపించబడిన వారూ ఇద్దరూ జీవించి ఉండే అవకాశాలు తక్కువ. 2023 జనవరి నాటికి నాలుగుకోట్లా ముప్లైలక్షల కేసులు పెండింగులో ఉన్నాయంటే ఈ ఏడాది కాలంలో ఆ సంఖ్య ఇంకా ఎంత పెరిగి ఉంటుందో లెక్క కడితేగానీ తెలియదు. పరిస్థితి ఇలాగే కొనసాగితే న్యాయవ్యవస్థకే నేర భారతం భారమైపోతుందనడానికి సందేహం అవసరం లేదు. న్యాయదేవత కళ్లకి గంతలు విప్పితే, దయనీయంగా ఉన్న న్యాయవ్యవస్థ వాస్తవ స్థితిని చూసి విస్తుపోవడం ఖాయం!

- రాజశ్రీ

## అవును భద్రత కరువే...!

అపార్టుమెంట్ల నిర్మాణంలో బిల్డర్లు తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారా..? అంటూ ఇటీవల మన 'లాయర్'లో రాసిన సంపాదకీయం చదివాను. అవును, మీరు రాసింది అక్షారాలా నిజం. వ్యాపార దృక్పథంతో మహా నగరాలలో బహుళ అంతస్తులను సునాయాసంగా నిర్మించేస్తున్నారు బిల్డర్లు. ముఖ్యంగా గత అయిదు సంవత్సరాలుగా ఊహించని స్థాయిలో అభివృద్ధి చెందుతున్న హైదరాబాదు నగరంలో యాభై అంతస్తులు అంతకుమించి కూడా నిర్మాణాలు సాగిస్తున్నారు. ఇల్లు కొనుక్కోవాలనుకునేవారికి తమ భవనాలలో కల్పిస్తున్న వసతుల గురించే చెప్తున్నారు తప్ప భద్రతా పరంగా తాము పాటించే సాంకేతిక నైపుణ్యత ఏ స్థాయిలో ఉందో చెప్పడం లేదు. యాభై నుండి డెబ్బై అంతస్తులు నిర్మించే సాంకేతిక పరిజ్ఞానం మన దేశంలో ఉందా..? ఉంటే అది ఏమిటి..? అన్న సమాచారం కూడా అపార్టుమెంటు కొనుక్కునేవారికి బిల్డర్లు ఇస్తే బాగుంటుంది. ఫ్లాటు కొనుక్కునే వారికి తమ భద్రత పట్ల నమ్మకం, భరోసా ఏర్పడతాయి.

వీసీ. శేఖర్, హైదరాబాదు.

## అధ్వాన్నంగా.. మధ్యాహ్నభోజనం

ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్నభోజనం పెడుతున్నారు. మంచిదే. అయితే చాలాచోట్ల అది నాశిరకంగా ఉంటోంది. పాసిపోయిన కూరలు, కుళ్ళిన కోడిగుడ్లు తరచూ పిల్లలకు పెడుతుండడం పత్రికల ద్వారా వెలుగులోకి వస్తున్నాయి. తమ బిడ్డలకు అలాంటి కుళ్ళిన పదార్థాలు ఇస్తున్నారని తెలిసి, తల్లితండ్రులు కలత చెందుతున్నారు. అలాంటివి తింటే అనారోగ్యం తప్పదు కదా!.. జిల్లా ఉన్నతాధికారులు పాఠశాలల్లో, హాస్టళ్లలో మెనూ, భోజనపదార్థాల నాణ్యతపై ఎప్పటికప్పుడు ఆకస్మిక తనిఖీలు ముమ్మరం చేయాలి. పిల్లలకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం సక్రమంగా అందేలా గట్టి చర్యలు తీసుకోవాలి.

పీ. మస్తానయ్య, ముసునూరు.

ఈ-మెయిల్
ప్రజావాణి
lawyerpatrika@gmail.com
+91 98663 14741

## వ్యసనాలకు బానిసలు కావొద్దు

యువత, ముఖ్యంగా విద్యార్థులు అనేకరకాల వ్యసనాలకు బానిసలవుతున్నారు. మద్యం, జూదం వంటి వాటికి అలవాటు పడుతూ జీవితాలు నాశనం చేసుకుంటున్నారు. మరి కొందరు ఆ వ్యసనాలకు డబ్బులు చేతిలో లేక చివరికి దొంగతనాలకి కూడా పాల్పడుతున్నారు. అటు వ్యక్తిగత జీవితాన్ని, ఇటు వారి కుటుంబాలను కూడా ఇబ్బందుల పాలుచేసే అలాంటి వ్యసనాలకు దూరంగా ఉండకపోతే ఇల్లూ ఒళ్ళూ రెండు గుల్లే. పాఠశాలల్లో చిన్నస్థాయి నుంచే అవగాహన కలిగించి, విద్యార్థులు అలాంటి దురలవాట్ల జోలికిపోకుండా చూడాలి. తల్లితండ్రులు, ఉపాధ్యాయులు అందుకు ముఖ్యంగా శ్రద్ధ తీసుకోవాలి.

కెసి సాయి, ఇందుకూరుపేట.

# చిన్నారుల భవిష్యత్తుకు ప్రసన్న చేయూత



గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా బుచ్చినగర పంచాయతీలో ఎమ్మెల్యే ప్రసన్న పర్యటిస్తుండగా కొన్ని కుటుంబాల్లో కొంతమంది తల్లిని కొంతమంది తండ్రిని కోల్పోయిన పిల్లలను చూసి వారి భవిష్యత్తుకు బాట వేయాలనే ఆలోచనతో రామచంద్రపురం, పెద్దూరు, హరిజనవాడ, మంగళపాలెంకు చెందిన 11మంది పిల్లలకు ఒక్కొక్కరికి రూ. 20,000 చొప్పున మొత్తం రూ. 2లక్షల 20వేల రూపాయలను కేటాయించారు. తమ తండ్రి స్వర్గీయ నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఆ పిల్లలకు 18 సంవత్సరాలు వచ్చేంతవరకు ఆ డబ్బును బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయించి, ఆ పత్రాలను ఇటీవల వారి కుటుంబసభ్యులకు ఎమ్మెల్యే తన చేతుల మీదుగా అందజేశారు.

## మృతుల కుటుంబాలకు సాయం :

కోవూరు నియోజకవర్గంలోని విడవలూరు మండలం రామతీర్థంలో.. శ్రీ రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో సముద్ర స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తూ మరణించిన పార్లపల్లి గ్రామానికి చెందిన సర్వేపల్లి కార్తీక్, బండ్ల కళ్యాణ్‌కుమార్ కుటుంబాలకు కోవూరు శాసనసభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి చేయూతనందించారు. మృతుల విషయాన్ని ముఖ్యమంత్రి వై.యస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఆ రెండు కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి నుండి 2లక్షల రూపాయల వంతున ఆర్థిక సాయం మంజూరుకాగా, ఆ చెక్కులను ఆయన ఇటీవల మృతుల కుటుంబాలకి అందజేశారు. అంతేకాక, తమ తండ్రి, దివంగత నేత స్వర్గీయ నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఆ రెండు కుటుంబాలకు లక్ష రూపాయల వంతున సాయం ప్రకటించారు.

# చెన్నయ్యకు డా. అంబేద్కర్ అవార్డు



వివిధ రాష్ట్రాలకు చెందిన సామాజిక సేవకులకు తమిళనాడు రాష్ట్రంలోని హోసూరులోని ఆసియా ఇంటర్నేషనల్ కల్చరల్ అకాడమీ వారు అందజేస్తున్న ఉత్తమ పురస్కారాన్ని నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాళెంకు చెందిన ప్రముఖ సామాజిక సేవకుడు డాక్టర్ చీదరాల చెన్నయ్య ఇటీవల అందుకున్నారు. తమిళనాడులోని పలువురు ప్రముఖుల సమక్షంలో ఆయన ఈ విశిష్టమైన అవార్డునందుకున్నందుకు స్థానికులు ఆయన్ను అభినందించారు.

# కామధేను కేంద్రంలో బక్కచిక్కిపోతున్న గోవులు

- **జేసీకి చెప్పిన మిడతల రమేష్**



నెల్లూరు జిల్లాలోని చింతలదీవిలో ఉన్న జాతీయ పశు పునరుత్పత్తి కేంద్రంలో మేత లేక, గోవులు గేదెలు బక్కచిక్కిపోతున్నాయని, వాటికి వెంటనే ఆహారం పెట్టి రక్షించాలని బీజేపీ నమామి గంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ జిల్లా జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్‌ను ఇటీవల జరిగిన స్పందన కార్యక్రమంలో కోరారు. ఆ కేంద్రం పరిస్థితి దయనీయంగా మారిందని, 40 గోవులు అనారోగ్యంతో ఉన్నాయని, కొన్ని అనారోగ్యంతో ఉన్న పశువులను ప్రత్యేక రేకుల షెడ్‌లో ఉంచారు కానీ, వాటికి కూడా తగిన ఆహారం అందించడం లేదని ఆయన జేసీ దృష్టికి తీసుకువచ్చారు. అక్కడున్న పునరుత్పత్తి చేసే మిషన్ సైతం వినియోగంలో లేదని, లక్షలు ఖర్చుపెట్టి నిర్మించిన బయోగ్యాస్ ప్లాంట్ నిరుపయోగంగా ఉందని, ఆ మూగజీవాల త్రాగునీటి కోసం రాళ్లపాడు ప్రాజెక్టు నుండి వేస్తున్న పైపులైన్ పనులు ఆగిపోయాయని ఆయన చెప్పారు. రాష్ట్రంలో జగన్ సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ ప్రాజెక్టు అభివృద్ధికి ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని, సోమశిల ఉత్తర కాలవ నుంచైనా గోవులకు నీరు అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆడిటర్ లక్ష్మణరావు. కంచర్ల నారాయణ యాదవ్, కేశవ నలగట్ల వెంకటేశ్వరు, జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.



## డిసెంబర్ 15 నుండి..

# 'అడుదాం ఆంధ్ర'

రాష్ట్ర ప్రభుత్వం గ్రామ స్థాయి నుండి క్రీడలను ప్రోత్సహించేలా డిశంబర్ 15వ తేదీ నుండి 2024, ఫిబ్రవరి 3వ తేదీ వరకు క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ మరియు ఖోఖో.. ఈ 5 క్రీడా అంశాలతో క్రీడాపోటీలు నిర్వహిస్తామని, పోటీ లేకుండా యోగ, టెన్నికాయిట్, మారథాన్ క్రీడలను నిర్వహిస్తోందని జిల్లా జాయింట్ కలెక్టర్, ఈ క్రీడల నోడల్ అధికారి కూర్మనాథ్ చెప్పారు. నవంబరు 27న నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జేసీతో పాటు, నెల్లూరు నగర పాలక సంస్థ కమిషనర్ వికాస్ మర్మత్, అసిస్టెంట్ కలెక్టర్ సంజనా సింహాలతో కలసి ఈ క్రీడోత్సవాలపై రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ, పురుషులు, మహిళల కోసం 5 విభాగాల్లో వేర్వేరుగా క్రీడా పోటీలు నిర్వహిస్తామన్నారు. 15 సంవత్సరాలు వయస్సు పైబడిన వారు మాత్రమే ఈ క్రీడల్లో పాల్గొనేందుకు అర్హులన్నారు. జిల్లాలోని 768 గ్రామ-వార్డు సచివాలయాల పరిధిలో 23,070 మ్యాచ్‌లు, మండలస్థాయిలో 39 మండలాల్లో 730 మ్యాచ్‌లు, 8 నియోజకవర్గాల స్థాయిలో 320 మ్యాచ్‌లు, జిల్లా స్థాయిలో 70మ్యాచ్‌లు మొత్తం అన్ని స్థాయిల్లో కలిపి 24,190మ్యాచ్‌లు నిర్వహించడం జరుగుతుందని వివరించారు. గెలుపొందిన వారికి సర్టిఫికెట్లు, ట్రోఫీలు మరియు పతకాలు అందజేయడం జరుగుతుందని పేర్కొన్నారు. క్రీడాకారుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ నవంబరు 27వ తేదీ నుండి జరుగుతుందని, ఈ క్రీడల్లో పాల్గొనే ఔత్సాహికులు ఆన్‌లైన్లో కానీ, 1902 నెంబర్‌కు కాల్‌చేసి కానీ, లేదా గ్రామ-వార్డు వలంటీర్ల ద్వారా గానీ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు గంగ స్పెషల్ కలెక్టర్ టి.బాపిరెడ్డి, జిల్లా పరిషత్ సీఇఓ బి.చిరంజీవి, సెట్నల్ సీఇఓ నాగరాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచ్‌ల సంఘం..

# రాష్ట్ర కార్యవర్గంలో పావని



తోటపల్లిగూడూరు మండలంలోని విలుకానిపల్లి గ్రామసర్పంచ్ గోపిరెడ్డి పావని రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం సంయుక్త కార్యదర్శిగా నియమితులయ్యారు. నవంబరు 27న రాష్ట్ర పంచాయతిరాజ్ ఛాంబర్ అధ్యక్షులు వైవివి రాజేంద్ర ప్రసాద్ చేతులమీదుగా ఆమె ఆమేరకు నియామకపత్రాన్ని అందుకున్నారు. రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం నాయకులు దేవారెడ్డి నాగేంద్ర, ప్రసాద్‌రెడ్డి, కె.శ్రీనివాసన్, ఉమ్మడి నెల్లూరుజిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు కందమూడి శివకుమార్, ఉపాధ్యక్షురాలు చిట్టేటి కవిత, చాంబర్ నాయకులు గోపిరెడ్డి వెంకటేష్ యాదవ్, మునీష్ తదితరులు పాల్గొన్నారు.

# పెంచలకోనలో.. టీటీడీ ఛైర్మెన్ పూజలు



నిత్యం తిరుమలలోని శ్రీవేంకటేశ్వరస్వామి సేవలో తరించే టీటీడీ బోర్డు ఛైర్మెన్ భూమన కరుణాకర్‌రెడ్డి, నవంబరు 27న ఉభయ నెల్లూరుజిల్లా పరిధిలోని రాపూరు మండలం పెంచలకోనలో ఉన్న ప్రముఖ పుణ్య క్షేత్రం.. శ్రీ పెనుశిల లక్ష్మీనృసింహ స్వామి క్షేత్రాన్ని దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామివారు-అమ్మవార్ల సన్నిధిలో పూజలు చేయించి వేదమంత్రాలతో వేదపండితులు ఆయన్ను ఆశీర్వదించారు. అనంతరం ఆలయంలోని నిత్యకల్యాణ మండపంలో స్వామి-అమ్మవార్ల చిత్రపటాన్ని బహుకరించి, స్వామివార్ల తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ ప్రధాన అర్చకులు సీతారామయ్యస్వామి, పెంచలయ్యస్వామి, దేవాలయ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# శివాలయాల్లో కార్తీక వెలుగులు



కార్తీకమాసం రెండవ సోమవారం సందర్భంగా నవంబరు 27న నగరంలోని శివాలయాలు కార్తీక దీపకాంతులతో వెలుగులు చిందించాయి. భక్తుల శివనామోచ్ఛారణలతో ఆలయాలు మార్మోగాయి. నెల్లూరులోని ప్రాచీన శైవక్షేత్రం భువనేశ్వరిదేవి సమేత శ్రీ మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో వేలాదిమంది మహిళాభక్తులు కార్తీకదీపాలు వెలిగించి ఆ పరమేశ్వరుని దర్శించుకున్నారు. ఉదయం నుంచి రాత్రి దాకా భక్తులు ఒక ప్రవాహంలా ఆలయానికి వచ్చి భక్తిశ్రద్ధలతో దీపాలు వెలిగించి పూజలు చేశారు. దీంతో ఆలయప్రాంగణమంతా క్రిక్కిరిసిపోయింది. అదేవిధంగా దర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో కొలువైవున్న మీనాక్షిదేవి సమేత శ్రీ సుందరేశ్వరస్వామి దేవస్థానంలో కార్తీక దీపాలు వెలిగించి పూజలు చేశారు. స్వామివారి సన్నిధిలో మహన్యాస పూర్వక రుద్రాభిషేకాన్ని వేడుకగా నిర్వహించారు. నవాబుపేటలోని భ్రమరాంబాదేవి సమేత శ్రీ మల్లేశ్వరస్వామి ఆలయం, ములుముడి బస్టాండ్ వద్దనున్న శ్రీ హరిహరనాథా లయం తదితర ఆలయాల్లో విశేషపూజలు జరిగాయి. మూలాపేటలోని శంకరమఠంలో కామాక్షిదేవి సమేత శ్రీ చంద్రమౌళీశ్వరస్వామి సన్నిధిలో వైభవంగా చండీహోమం నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో ఈ పూజల్లో పాల్గొన్నారు.

# అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయ సాధన కోసం ప్రతిఒక్కరూ కృషిచేయాలని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (పీసీసీ) సభ్యులు తలారి బాలసుధాకర్ కోరారు. భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా నవంబరు 26న నెల్లూరు, వీఆర్‌సి సెంటర్‌లో ఉన్న డా. అంబేద్కర్ విగ్రహానికి ఆయన పూలమాలవేసి నివాళులర్పించారు.


## బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా నా క్లయింట్ అయిన **శ్రీ కస్తూరిదేవి విద్యాలయ కమిటీ సొసైటీ, దర్గామిట్ట, నెల్లూరు-2, అర్బన్, నెల్లూరు, ఆంధ్రప్రదేశ్-524003 వారి** నుంచి వకాల్తా పొంది ఇచ్చుచున్న బహిరంగ ప్రకటన.

నా క్లయింటు తరపున సమాచార హక్కు - 2005 (రైట్ టు ఇన్‌ఫర్‌మేషన్ యాక్టు-2005) ప్రకారము ఎటువంటి స్వచ్ఛంద సమాచారము కావలసియున్న యెడల ఈ విషయములో వారి న్యాయవాది అయిన నన్ను సంప్రదించగలరు.

**విజయవాడ/ అమరావతి**
**తేది: 25-11-2023**

ఇట్లు : **వి.రవీంధర్**
న్యాయవాది, హైకోర్టు ఆఫ్ ఆంధ్రప్రదేశ్.
సెల్ : 91488 74841.

# నెల్లూరు కబుర్లు

## ఆదాల చొరవతో..
# పంటకాలువల పూడికతీత



నెల్లూరు రూరల్‌లోని 20వ డివిజన్‌లో వర్షాల కారణంగా ప్రజలు ఇబ్బందులు పడకుండా ముందస్తుగా పంట కాలువలు, పెద్ద డ్రైన్ అన్నిటిలో ఇటీవల పెద్దఎత్తున పూడికతీత కార్యక్రమం చేపట్టారు. ఈ డివిజన్‌లో చాలాకాలం నుండి పంట కాలువల్లో వర్షపు నీరు సాఫీగా వెళ్లకుండా కాలువల్లో మురికి నీరంతా రోడ్ల మీదకి వస్తోంది. కొన్ని ప్రాంతాల్లో ఇళ్ళల్లోకి నీళ్ళు వస్తున్నాయి. ఈ సమస్యను స్థానిక వైకాపా నాయకులు నెల్లూరు ఎంపీ, వైకాపా రూరల్ ఇన్‌చార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డి దృష్టికి తీసుకురాగా, ఆదాల వెంటనే స్పందించి మున్సిపల్ కమిషనర్‌ను తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో కమిషనర్, తదితర అధికారులు రంగంలోకిదిగి 20వ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో పంట కాలువలు పూడిక తీయించారు. 20వ డివిజన్ ఇన్‌ఛార్జి, శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి ఆలయ ట్రస్ట్ బోర్డ్ ఛైర్మెన్ రావు శ్రీనివాసరావు (ఆర్ఎస్ఆర్), నాయకులు తాళ్లూరి సురేష్‌బాబు, దువ్వూరు భాస్కర్‌రెడ్డి, సచివాలయం కన్వీనర్లు చెవిరెడ్డి గోపాల్‌రెడ్డి, పోలంరెడ్డి నాగేశ్వర్‌రెడ్డి, గొడుసు సరళమ్మ, పోతురాజు రమాదేవి, కట్టా ఏడుకొండలు పాల్గొన్నారు.

## చేనేత నాయకుల.. రౌండ్‌టేబుల్ సమావేశం

నెల్లూరు హరనాథపురంలో నవంబరు 28న చేనేతసంఘాల నాయకుల రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. చేనేతల అభ్యున్నతికి కేంద్రబడ్జెట్‌లోనూ, రాష్ట్ర బడ్జెట్‌లోనూ పుష్కలంగా నిధులు కేటాయించాలని చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ జిల్లా కన్వీనర్ బుధవరపు బాలాజీ కోరారు. చేనేత ఉపవృత్తుల వారికి కూడా రాష్ట్ర ప్రభుత్వం 'నేతన్న నేస్తం' పథకాన్ని వర్తింపజేయాలని, హ్యాండ్‌లూమ్ బోర్డును కేంద్రం పునరుద్ధరించాలని విజ్ఞప్తిచేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు జీవీ నాగేశ్వరరావు, లక్ష్మీనారాయణ, మాజీ ఎమ్మెల్సీ బూదాటి రాధా కృష్ణయ్యతో పాటు వివిధ ప్రాంతాల నాయకులు పాల్గొన్నారు.

## శివాలయంలో 'కృష్ణచైతన్య' డైరెక్టర్ల పూజలు



చిలుక ఏకాదశి, కార్తీక మహోత్సవాలను పురస్కరించుకుని నెల్లూరు మూలాపేటలోని శ్రీ మూలస్థానేశ్వరాలయంలో ఇటీవల స్థానిక కృష్ణచైతన్య విద్యాసంస్థల డైరెక్టర్లు ఆర్‌వి కృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డిలు ప్రత్యేకపూజలు నిర్వహించారు. మహాశివునికి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన స్వామి-అమ్మవార్ల పల్లకి సేవలో పాల్గొని, భక్తులకు అన్నదానం చేశారు. తమ కళాశాల తరపున ప్రతి ఏటా చిలుక ఏకాదశి సందర్భంగా ఈ ఆలయంలో అభిషేకాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వారు చెప్పారు.

## జయభారత్ ఆసుపత్రికి..
# లక్షా 50వేల విరాళం



నెల్లూరులోని 'జయభారత్ ఆసుపత్రి'కి హైదరాబాద్‌కు చెందిన దాత బెజవాడ కృష్ణారెడ్డి సతీమణి బెజవాడ సుబ్బులక్ష్మి, తన జన్మదినాన్ని పురస్కరించుకుని నవంబరు 28న లక్షా 50వేల రూపాయలను విరాళంగా అందించారు. కంటి సమస్యలు ఎదుర్కొంటున్న రోగుల కంటిఆపరేషన్ల కోసం ఈ విరాళం అందజేసినట్లు వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా 16 మంది రోగులకు కంటి ఆపరేషన్లు ఉచితంగా నిర్వహించారు. ఆసుపత్రి నిర్వాహకులు దాతల పేరుతో దేవునిగుడిలో పూజలు చేయించి, ఆసుపత్రిలోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు.

## శ్రీ సత్యనారాయణస్వామి వ్రతం

కార్తీకపున్నమి సందర్భంగా నెల్లూరు దర్గామిట్టలో కొలువైవున్న శ్రీ రాజరాజేశ్వరిదేవి అమ్మవారి ఆలయంలో నవంబరు 27..రెండో కార్తీక సోమవారం రోజున భక్తులు పెద్దసంఖ్యలో సామూహిక శ్రీ సత్య నారాయణస్వామి వ్రతాలాచరించారు. ఆలయ ఛైర్మెన్ రత్నం జయరామ్, కార్యనిర్వాహణాధికారి అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యుల పర్యవేక్షణలో ఈ వ్రతాలు వేడుకగా జరిగాయి.



## గ్రామీణప్రాంతాల ప్రగతికి కృషిచేయండి
### - స్థాయీ సంఘసమావేశాల్లో ఆనం అరుణమ్మ

రాష్ట్ర ప్రభుత్వం పేద, బడుగు బలహీన వర్గాలకు అమలు చేస్తున్న వివిధ రకాల సంక్షేమ పథకాలు అందరికీ అందేలా అధికారులు కృషి చేయాలని జెడ్పీ చైర్ పర్సన్ శ్రీమతి ఆనం అరుణమ్మ కోరారు. నవంబరు 28న నెల్లూరులోని జడ్పీ సమావేశ మందిరంలో జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, జడ్పీవైస్ చైర్‌పర్సన్ చిగురుపాటి ప్రసన్నల ఆధ్వర్యంలో స్థాయీసంఘ సమావేశాలు జరిగాయి. ఈ సమావేశాల్లో పలు ప్రభుత్వ శాఖల ద్వారా ప్రజలకు అందుతున్న సంక్షేమపథకాలను సమీక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపర్చేందుకు అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలుచేస్తున్నదని, వాటిని ప్రజలకు సకాలంలో అందించడంతో పాటు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కృషిచేయాలని జడ్పీ ఛైర్‌పర్సన్ సూచించారు. ఆయా పథకాల పనులను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆమె ఆదేశించారు. గ్రామాల నుండి సమీప పట్టణ ప్రాంతాలకు, మండల కేంద్రాలకు అనుసంధానమైన రోడ్లు తీవ్రంగా దెబ్బతిన్నాయని, వాటిని వెంటనే మరమ్మత్తులు చేయించాలని స్థాయీసంఘ సభ్యులు ఈ సందర్భంగా ఛైర్‌పర్సన్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమావేశాల్లో శాసనమండలి సభ్యులు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా పరిషత్ సీఇఓ భూపతి చిరంజీవి, పంచాయతీ రాజ్ ఎస్ఇ శ్రీధర్, హౌసింగ్ పీడీ నాగరాజు, వ్యవసాయశాఖ జేడీ సత్యవాణి, డీఇఓ గంగాభవాని, సర్వశిక్ష ఏపీడీ ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

## ఎస్వీయు ఇన్‌ఛార్జి వీసీగా.. విఎస్‌యు వీసీ
### ● ఆచార్య జి.ఎం సుందరవల్లి నియామకం



తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ ఇన్‌ఛార్జి వైస్‌చాన్సలర్‌గా నెల్లూరులోని విక్రమసింహపురి విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య జి.ఎం సుందరవల్లికి అదనపు బాధ్యతలు కేటాయిస్తూ ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులిచ్చింది. ఎస్వీయు వీసీ రాజారెడ్డి పదవీకాలం ముగియడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

# 'తంగిరాల మహాభారతం' 83వ భాగం




రెండవసారి జూదంలో ఓడిపోయిన తర్వాత క్రోధావేశులైన పాండవులు, ద్రౌపది, కుమారులతో కలిసి అరణ్యవాసానికి బయలుదేరుతారు. హస్తినాపురం ప్రజలు కొంతమంది వారితో పాటు అరణ్యాలకు వస్తామని కోరితే, ధర్మరాజు అంగీకరించక వారిని తిప్పి పంపించివేస్తాడు. కానీ, చాలామంది బ్రాహ్మణులు వారి పరివారంతో వచ్చి అరణ్యంలో పాండవులతో పాటు ఉంటామని పట్టుబడతారు. చివరకు ధర్మరాజు అంగీకరించాడు. కానీ, వారికి ఎలా ఆహారం పెట్టాలో తెలియక ఆందోళన పడతాడు. అప్పుడు ధౌమ్య మహాముని ధర్మరాజుని సూర్యభగవానుని ప్రార్థించమని సూర్య అష్టోత్తర శతనామావళి ఉపదేశిస్తాడు. ధర్మరాజు నిష్ఠగా భగీరథ నదిలో దిగి సూర్యున్ని ఆరాధిస్తాడు.

సూర్యుడు సంతోషించి ప్రత్యక్షమై ధర్మరాజుకు అక్షయపాత్రను ప్రసాదించి, దీనివలన ద్రౌపది ఎంతమందికన్నా ఆహారం చేయగలదని కటాక్షిస్తాడు. తర్వాత పాండవులు కామ్యకారణ్యానికి బయలుదేరుతారు.






భారత కాలమానం ప్రకారం ప్రతి శనివారం ఉదయం యూట్యూబ్‌లో తంగిరాల 'మహాభారతం' అందుబాటులోకి వస్తుంది. పూర్తి నిడివి కోసం Syam Tangirala Mahabharatam @YouTubeలో చూడగలరు.

## విఎస్‌యులో..డా. అంబేద్కర్ విగ్రహావిష్కరణ



నెల్లూరులోని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కేంద్ర గ్రంథాలయం ఎదురుగా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని విఎస్‌యు వీసీ ఆచార్య జి.ఎం సుందరవల్లి ఆవిష్కరించారు. నవంబరు 26న భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని వీసీ మాట్లాడుతూ భారతదేశానికి గొప్ప రాజ్యాంగ వ్యవస్థను ప్రసాదించిన డా. బిఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించడం తన పూర్వజన్మ సుకృతమన్నారు. డాక్టర్ అంబేద్కర్ స్ఫూర్తితో నేటి యువతరం ముందుకు సాగి సమసమాజ స్థాపనకు కృషి చేయాలని తెలిపారు. అనంతరం విశ్వవిద్యాలయంలోని కమ్యూనిటీ డెవలప్‌మెంట్ బోర్డ్ ఆధ్వర్యంలో గోడపత్రికలను ఆవిష్కరించారు. విఎస్‌యు రిజిస్ట్రార్ ఆచార్య పి. రామచంద్రారెడ్డి, ప్రిన్సిపాల్ ఆచార్య విజయానంద్‌కుమార్‌బాబు, సిడిసి డీన్ విజయ, కోఆర్డినేటర్ జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాంగ నిర్మాతకు నివాళి

భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా నవంబరు 26న నెల్లూరు నగరంలోని మాగుంట లేఅవుట్‌లో ఉన్న వైకాపా జిల్లా కార్యాలయంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి,విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, జిల్లా వైకాపా మహిళా అధ్యక్షురాలు మొయిళ్ళ గౌరీ, ప్రధాన కార్యదర్శి సునీల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అన్నమయ్య కీర్తనలు ఎన్నిసార్లు విన్నా.. తనివి తీరదు

## - శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి



అన్నమయ్య కీర్తనలు ఎన్నిసార్లు విన్నా తనివి తీరదని శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి కొనియాడారు. చెన్నైలోని వేద విజ్ఞాన వేదిక, శ్రీసిటీ శ్రీవాణి సంయుక్త ఆధ్వర్యంలో నవంబరు 26న 'అన్నమయ్య సంకీర్తనావళి' కార్యక్రమం అత్యద్భుతంగా జరిగింది. చెన్నై టి-నగర్ ఆంధ్రాక్లబ్‌లోని గోదావరి హాల్‌లో రెండున్నర గంటల పాటు సాగిన ఈ కార్యక్రమం అందరినీ భక్తిభావసమన్వితులను చేసింది. ఈ సందర్భంగా రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ, వేద విజ్ఞాన వేదిక స్ఫూర్తితోనే శ్రీసిటీలో శ్రీవాణి ఆధ్యాత్మిక సాహిత్య వేదికను గత ఏడాది ప్రారంభించామని, అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో గొప్ప పారిశ్రామిక నగరంగా ఎదుగుతున్న శ్రీసిటీలో ఆధ్యాత్మికం, సాహిత్యం, కళలు కూడా ఒక భాగం కావాలన్నది తన ఆకాంక్ష అని చెప్పారు. ఇవన్నీ తమ ప్రాంత ప్రజల ప్రశాంత జీవనానికి ఎంతగానో ఉపకరిస్తాయన్నారు. ఇది శ్రీసిటీ-శ్రీవాణి సౌజన్యంతో చేపట్టిన అన్నమయ్య సంకీర్తనావళి 3వ కార్యక్రమమని చెప్పారు. తొలి కార్యక్రమం శ్రీసిటీలో జరుగగా, రెండవ కార్యక్రమం నెల్లూరులోని అన్నమాచార్య జయంత్యుత్సవ కమిటి ఆధ్వర్యంలో వైభవంగా జరిగిందని అన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న టీటీడీ శ్వేతా మాజీ డైరెక్టర్ భూమన్ మాట్లాడుతూ, పదకవితా పితామహుడు, తొట్ట తొలి తెలుగు వాగ్గేయ కారుడు తాళ్లపాక అన్నమాచార్యుల వారి సంకీర్తనల వైశిష్ట్యాన్ని వివరించారు. అనంతరం భూమన్ విశ్లేషించి వ్యాఖ్యానించిన కొన్ని అన్నమాచార్య సంకీర్త నలను ప్రముఖ గాయకులు సరస్వతి ప్రసాద్ వీనుల విందుగా ఆలపించారు. 'త్రికరణశుద్ధిగా', 'ఏ కులజుడైన ఏమీ', 'బ్రహ్మమొక్కటే పరబ్రహ్మమొక్కటే' వంటి పలు ప్రసిద్ధ సంకీర్తనలను ఆయన వీనులవిందుగా గానం చేశారు. వేదవిజ్ఞాన వేదిక కార్యదర్శి మధు స్వాగతం పలకగా, శ్రీవల్లి ప్రార్థనాగీతంతో ఈ కార్యక్రమం మొదలైంది. వేదిక అధ్యక్షులు జెకె రెడ్డి అధ్యక్షత వహించారు. శ్రీసిటీ-శ్రీవాణి వేదిక ద్వారా ఈ కార్యక్రమానికి సహకరించిన శ్రీసిటీ ఎం.డీ డా. రవీంద్ర సన్నారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం, భూమన్‌ను, కళాకారుల బృందాన్ని శ్రీసిటీ ఎం.డీ ఘనంగా సత్కరించారు.

# స్వర్ణకారుని కుటుంబానికి.. సాయం

కావలిలో ఇటీవల అనారోగ్యంతో మరణించిన నిరుపేద స్వర్ణకారుడు మహేష్ ఆచారి కుటుంబానికి కావలి స్వర్ణకారుల సంఘం అధ్యక్షుడు పుత్తూరు నాగరాజాచారి ఆధ్వర్యంలో నవంబరు 27న లక్షా 5వేల రూపాయలను అందజేసి ఆ కుటుంబానికి తమవంతు చేయూతనందించారు. స్వర్ణకారులకు ఎలాంటి కష్టం వచ్చినా ఆదుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం ప్రధాన కార్యదర్శి వెంకటేష్ ఆచారి, సహాయ కార్యదర్శి మునికుమార్, కోశాధికారి జరీఫ్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# రవాణా శాఖలో పారదర్శక పాలన

## దళారులకు చెక్ పెట్టిన..డీటీసీ చందర్

***నెల్లూరులోని రవాణా కార్యాలయంలో దళారులు, ప్రైవేట్ వ్యక్తుల జోక్యానికి చెక్ పెడుతూ నెల్లూరు ఉప రవాణా కమిషనర్ (డీటీసీ) చందర్ కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటుండడంతో రవాణా కార్యాలయంలో పారదర్శకంగా పనులు జరిగేందుకు మార్గం సుగమమైంది. దీంతో వాహనదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాదు, వాహనదారులకు ఎంతో ముఖ్యమైన డ్రైవింగ్ లైసెన్స్ ఇవ్వడంలో దళారుల ప్రమేయానికి తావులేకుండా నూతనంగా 'ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్టింగ్ ట్రాక్' నిర్మాణాన్ని కూడా కొత్తగా ప్రారంభించారు. దీంతో పూర్తిస్థాయిలో కండిషన్‌లో ఉన్న వాహనాలకు మాత్రమే ఇకనుంచి ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌ను జారీచేయనున్నారు. అందుకు అవసరమైన ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్‌ను నెలకొల్పేందుకు సన్నాహాలూ ప్రారంభమయ్యాయి.***



రవాణా కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్న పనులను తాము చేసిపెడతామంటూ వాహనదారుల నుంచి డబ్బులు తీసుకుని కార్యాలయం లోపలకి దర్జాగా వస్తున్న ప్రైవేట్‌వ్యక్తులను నియంత్రిస్తూ డీటీసీ కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారు. గతంలో అక్కడ దళారులదే రాజ్యంగా ఉండేది. ఇప్పుడలా కాదు, ఎప్పటికప్పుడు అధికారుల పర్యవేక్షణ ఏర్పాటుచేసి, ఎవరు.. ఏ పనిమీద కార్యాలయానికి వస్తున్నారో ముందుగా తెలుసుకున్న తర్వాతనే, వారిని కార్యాలయంలోకి అనుమతించే పద్ధతిని తాజాగా ప్రవేశపెట్టారు. దీంతో, దళారులకు-ప్రైవేట్ వ్యక్తుల ప్రమేయానికి అడ్డుకట్ట వేసినట్లయింది. ఈ నేపథ్యంలో, రవాణా సేవలు పారదర్శకంగా అందుబాటులోకి రావడంతో వాహనదారుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

### వాహనాలు కండిషన్‌లో ఉంటేనే..ఫిట్‌నెస్

వాహనాల ఫిట్‌నెస్‌ను ఇప్పటిదాకా అధికారులు మ్యాన్యువల్ పద్ధతిలో పరీక్షించి సర్టిఫికెట్ ఇచ్చేయడం జరుగుతుండేది. వాహనం కండిషన్‌లో లేకున్నా డబ్బులిస్తే చాలు అన్నీ బాగున్నాయంటూ సర్టిఫికెట్ ఇచ్చేవారనే విమర్శలుండేవి. ఇప్పుడు ఆ పద్ధతిని మాన్పించి, ఎలాంటి ఆరోపణలకు తావులేకుండా, ఇకనుంచీ వాహన ఫిట్‌నెస్‌ను వీడియో కెమెరాలు, సెన్సార్లు పరీక్షించిన తర్వాతనే సర్టిఫికెట్‌ను అందజేసేవిధంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. త్వరలోనే ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ ఏర్పాటుకు కూడా కృషి జరుగుతోంది. దీని ద్వారా వాహనంలో ఏ చిన్న లోపం ఉన్నా తెలిసిపోతుంది.

### దళారులతో పనే లేదు :

సాధారణంగా రవాణాశాఖలో 83 రకాల సేవలను రాష్ట్ర ప్రభుత్వం ఆన్‌లైన్ ద్వారా వాహనదారులకు అందుబాటులో ఉంచింది. ఎవరూ కార్యాలయానికి రానవసరం లేకుండా ఇంటి వద్ద, లేకుంటే వారికి దగ్గరలోని ఆన్‌లైన్ సెంటర్ వద్ద వారికి కావాల్సిన సేవలను అందుకునే వెసులుబాటు కల్పించింది. అయితే, ఆయా వాహనాలకు సంబంధించి పూర్తి వివరాలు ఆన్‌లైన్‌లో సమర్పించకుంటే అవి పెండింగ్‌లో ఉంటాయి. దీనిని ఆసరాగా తీసుకుని కొందరు దళారులు, ఆ పనులను తాము చేయిస్తామంటూ వాహనదారుల నుంచి డబ్బు తీసుకుంటున్నారన్న సమాచారంతో, డీటీసీ అలాంటి అక్రమాలకు అడ్డుకట్ట వేశారు. అసలు దళారులు కార్యాలయంలోకి అడుగుపెట్టకుండా పటిష్టమైన చర్యలు తీసుకున్నారు. అంతేకాదు, రవాణా ఉద్యోగులు సక్రమంగా పనిచేస్తున్నారా లేదా అనే విషయంపై కూడా దృష్టిసారించి, వారి పనితీరు గమనించాలంటూ ఆర్టీఓ సిరిచందన, ఏఓలు కిషోర్, రామ్మోహన్‌లను డీటీసీ చందర్ నియమించడంతో, వారు ప్రతి రోజూ అన్ని విభాగాలను తనిఖీలు చేస్తున్నారు.

ఏదేమైనా, దళారుల రాకపోకలను నిరోధిస్తూ రవాణా కార్యాలయంలో పారదర్శకంగా పనులు జరిగేలా పటిష్టమైన ఏర్పాట్లు జరుగుతుండడం వాహనదారుల ప్రశంసలందుకుంటోంది.



## స్వర్ణభారత్‌లో సంబరంగా..

# దీపమ్మ పుట్టినరోజు వేడుక

అనాధలకు, అన్నార్తులకు, నిరుపేదలకు చేయూతనందిస్తూ 'సేవాదీపం'గా ఎంతోమంది జీవితాలకు వెలుగుబాటలు వేస్తున్న స్వర్ణభారత్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ దీపా వెంకట్ (దీపమ్మ) 49వ పుట్టిన రోజు వేడుకలు నవంబరు 24న సంబరంగా జరిగాయి. వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్ ప్రజామందిరంలో జరిగిన ఈ వేడుకల్లో తొలుత కేకును కట్‌చేసి దీపమ్మ సేవలను నిర్వాహకులు కొనియాడారు. ట్రస్టు సమన్వయకర్త జనార్ధనరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో విద్యార్థులకు, ఉపాధి కోర్సుల్లో శిక్షణ పొందుతున్న యువతకు, ఉద్యోగులకు స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటుచేయగా, సుమారు 60 మంది యువకులు, ఉద్యోగులు రక్తదానం చేశారు. మానసిక వికలాంగుల కేంద్రం, బ్రిడ్జి స్కూల్, అక్షర విద్యాలయంలలోనూ దీపమ్మ పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు.

# బిఎంఆర్‌కు అరుదైన అవార్డు



రాజ్యసభ సభ్యులు, మన నెల్లూరీయులు బీద మస్తాన్‌రావు (బిఎంఆర్)కు ఇటీవల అరుదైన అవార్డు లభించింది. దేశంలో రొయ్యల పరిశ్రమ (ఆక్వా)ను ప్రోత్సహించడంలో చేస్తున్న అపారమైన కృషికి, ఆ రంగంలో ఆయన అసమాన నైపుణ్యానికి గుర్తింపుగా ముంబైలోని ష్రిమ్ప్ రిటైల్ సంస్థ బిఎంఆర్‌కు 'అవార్డ్ ఆఫ్ ఎక్సెలెన్స్(ఆక్వా)'ను ప్రకటించింది. నవీ ముంబైలోని వాషిలోని సిడ్కో కన్వెన్షన్ సెంటర్‌లో ఇటీవల జరిగిన కార్యక్రమంలో ష్రిమ్ప్ రిటైల్ సంస్థ తరఫున ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆక్వాకల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ చైర్మన్ వడ్డి రఘురాం చేతులమీదుగా ఆ అవార్డును బీద మస్తాన్‌రావు కుమార్తె..బిఎంఆర్ గ్రూప్ డైరెక్టర్ మాధురి అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమెను అవార్డు ప్రదానకర్తలు ఘనంగా సన్మానించారు.

# ఆల్తూరి సేవలు అపూర్వం

ప్రముఖ దాత, శివభక్తుడు ఆల్తూరి గిరీష్‌కుమార్‌రెడ్డి ఆధ్యాత్మిక-సామాజిక సేవలు అపూర్వమని ఆయన అభిమానులు కొనియడారు. నవంబరు 26 గిరీష్‌కుమార్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు తోటపల్లిగూడూరు మండలంలోని ఆయన స్వస్థలమైన పాపిరెడ్డిపాళెంలో ఆనందోత్సాహాలతో జరిగాయి. గిరీష్‌ను గ్రామస్తులు, ప్రముఖులు, అభిమానులు ఘనంగా సన్మానించి పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్పారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పేడూరు సొసైటీ డైరెక్టర్ తిరువళ్ళూరు ఈశ్వరయ్య, గ్రామ సర్పంచ్ కదురు వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ, కన్నతల్లిని-జన్మభూమిని మరువకుండా తన స్వగ్రామమైన పాపిరెడ్డిపాళెం అభివృద్ధికి గిరీష్‌రెడ్డి చేస్తున్న కృషి మరువరానిదని, ఆల్తూరి గిరీష్‌కుమార్‌రెడ్డి, మహేష్‌రెడ్డిలు 'ఆపదల్లో ఆదుకునే సోదరులు'గా ప్రసిద్ధి చెందడం తమ గ్రామానికే గర్వకారణమని అన్నారు.



# నగరానికి తలమానికంగా 'నగర వనం'

## -- త్వరలో ప్రారంభిస్తామన్న మంత్రి కాకాణి --



నెల్లూరు నగరానికి తల మానికంగా జిల్లా అటవీశాఖ వారు అన్ని సదుపాయాలతో నగరవనాన్ని తీర్చిదిద్దుతున్నా రని, దీనిని త్వరలోనే ప్రారం భిస్తామని రాష్ట్ర వ్యవసాయ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చెప్పారు. నెల్లూరు రూరల్ మండలం కొత్తూరు సమీపంలో అటవీశాఖ నిర్మించిన నగర వనాన్ని మంత్రి ఇటీవల సంద ర్శించారు. సుమారు మూడు కిలోమీటర్ల పైగా కాలినడకన నగరవనంలో తిరుగుతూ, జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. నగరవనంలో మొక్కలు నాటారు. అటవీ శాఖ ద్వారా చేపట్టిన పనులను జిల్లా అటవీ శాఖ అధికారి చంద్రశేఖర్ ఈ సందర్భంగా మంత్రికి వివరించారు.

నెల్లూరు నగరం కాంక్రీట్ జంగిల్‌గా మారిన పరిస్థితుల్లో ప్రకృతిని ఆస్వాదించడానికి, నగరవాసులకు, పరిసర ప్రాంత ప్రజలకు ఇదొక పెద్ద ఊరట అని ఆయన అన్నారు. పిల్లలు ఆడుకునే ఆటస్థలం, ఓపెన్ జిమ్, షటిల్ కోర్ట్స్, యోగా సెంటర్, వాకింగ్ ట్రాక్, వ్యూ పాయింట్, మ్యూజికల్ ఫౌంటెన్, ఓపెన్ థియేటర్ ఎంతో సుందరంగా నిర్మిస్తున్నారని మంత్రి అన్నారు. ప్రస్తుతం చేపడుతున్న పనులతో పాటు టాయ్ ట్రైన్, జిప్పర్ లైన్, వాటర్ ఫాల్స్‌తో స్విమ్మింగ్ పూల్ అనుసంధానం చేయడం, వ్యూ పాయింట్ నుండి రోప్ వే కనెక్షన్ అనుసంధానం వంటివి చేయాలని సూచించారు. దాదాపు 145 హెక్టార్లలో నిర్మించిన ఈ నగరవనం పనులు సుమారు 90 శాతం వరకు పూర్తయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, జిల్లా అటవీశాఖ రేంజ్ అధికారులు మాల్యాద్రి, రవీంద్రబాబు, మహేశ్వర్‌రెడ్డి, మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.



## విద్యానగర్‌లో
# రాజ్యాంగ దినోత్సవం

కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో నవంబరు 26న భారత రాజ్యాంగ దినోత్సవం, ఎన్‌సిసి దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. 2-ఆంధ్ర యూనిట్, 10-ఆంధ్ర యూనిట్ ఎన్‌సిసి క్యాడెట్ల ఆధ్వర్యంలో 75వ ఎన్‌సిసి ఆవిర్భావ దినోత్సవం జరిగింది. కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ, భారత రాజ్యాంగ దినో త్సవం సందర్భంగా, డాక్టర్ బి.ఆర్ అంబే ద్కర్ భారతదేశానికి ఒక గొప్ప రాజ్యాం గాన్ని అందించారని కొనియాడారు. దాదాపు 14లక్షల మంది యువత ఎన్‌సిసి ద్వారా శిక్షణపొంది నాయకత్వ లక్షణా లతో దేశ నిర్మాణంలో తమవంతు బాధ్య తలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఎన్‌సిసి విద్యార్థులు కవాతు నిర్వహించి, అబ్బురపరిచే విన్యాసాలతో అందరినీ అలరించారు. ఈ సందర్భంగా, కళాశాల ఆవరణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సిసి ఆఫీసరు లెఫ్టినెంట్ గోవిందు మాధవయ్య, సబ్ లెఫ్టినెంట్ వి.మల్లికార్జున్‌రెడ్డి, వ్యాయామ అధ్యాపకురాలు శోభారాణి, ఎన్‌సిసి క్యాడెట్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎన్‌బికెఆర్ అధ్యాపకునికి డాక్టరేట్



కోట మండలం విద్యానగర్‌లో ఉన్న ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో పనిచేస్తున్న అధ్యాపకుడు పోలేపల్లి సుందర్‌రాజ రవికుమార్‌కు కాకినాడలోని నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం వారు ఇటీవల డాక్టరేట్ ప్రదానం చేశారు. 'మోడలింగ్ అండ్ డెవలప్‌మెంట్ ఆఫ్ ఫంక్షనలీ గ్రేడెడ్ మెటీరియల్స్ ఫర్ ప్రోడక్ట్ డెవలప్‌మెంట్ అప్లికేషన్స్' అనే అంశంపై ఆయన ఎన్‌బికెఆర్ అధ్యాపకులు డా.పి నందకుమార్, జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం-అనంతపురం ఉప కులపతి డా.జింకా రంగ జనార్ధన పర్యవేక్షణలో ఆ అంశంపై పరిశోధన పత్రం సమర్పించారు. డా. రవికుమార్‌ను ఈ సందర్భంగా ఎన్‌బికెఆర్ డైరెక్టర్ డా. వి. విజయకుమార్‌రెడ్డి, విభాగాధిపతి డా. సిహెచ్ విక్రమ్‌కుమార్, అధ్యాపకులు అభినందించారు. తనకు డాక్టరేట్ వచ్చేందుకు సహకరించిన కళాశాల కరెస్పాండెంట్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డికి ఆయన తన కృతజ్ఞతలు తెలియజేశారు.

## 'ఆక్సంచర్' సంస్థచే.. ప్రాంగణ ఎంపికలు

ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో ఇటీవల హైదరాబాద్‌కు చెందిన బహుళజాతి సంస్థ 'ఆక్సంచర్' వారు ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. బీటెక్ ఆఖరి సంవత్సరం చదువుతున్న అన్ని బ్రాంచ్‌ల విద్యార్థులు ఆ సంస్థ జరిపిన ఆన్‌లైన్ పరీక్షలకు హాజరయ్యారు. చెన్నైకి చెందిన హర్షన్, అఖిలన్‌ల ఆధ్వర్యంలో ఈ పరీక్షలు జరిగాయి. ఎన్‌బికెఆర్‌కు ఉన్న విద్యావనరులు, మంచి గుర్తింపు వల్ల ఇప్పటిదాకా 7 గొప్ప బహుళ జాతి కంపెనీలవారు ప్రాంగణ ఎంపికలు నిర్వహించడం సంతోషంగా ఉందని కళాశాల డైరెక్టర్ డా.వి.విజయకుమార్‌రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. ఆక్సంచర్‌తో పాటు టెక్ మహేంద్ర, టీసిఎస్, సిడికె గ్లోబల్ వంటి పలు కంపెనీల వారు కూడా ప్రాంగణ ఎంపికల కోసం ఎన్‌బికెఆర్‌కు రానున్నారని కళాశాల ప్రాంగణ ఎంపికల అధికారి డా.ఎన్ కిషోర్ ఈ సందర్భంగా తెలిపారు.

## తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

## బ్రాహ్మణ భవన్..
# అదనపు గదుల ప్రారంభం



గూడూరు పట్టణంలోని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ఆధ్వర్యంలో ఉన్న బ్రాహ్మణ భవనంలో నూతనంగా నిర్మించిన అదనపు భవనాలను ఈ నెల 25వ తేదీ 'లాయర్' పత్రిక సంపాదకులు తుంగా శివప్రభాత్‌రెడ్డి ప్రారంభించారు. గూడూరు ఎగువవీరారెడ్డిపల్లె, వెంకటగిరిరోడ్డులో ఉన్న ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవాసంఘ సమాఖ్య ఆధ్వర్యంలో ఉన్న ఈ బ్రాహ్మణ భవనంలో పలువురు దాతలను, నెల్లూరుకు చెందిన శిరోమణిశర్మను, కొంతమంది బ్రాహ్మణులను తుంగా శివప్రభాత్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా అదనపు గదులను ఏర్పాటుచేయడం చాలా ఆనందంగా ఉందని, ఈ బ్రాహ్మణ భవనాన్ని బ్రాహ్మణు లందరూ వినియోగించుకోవాలని కోరారు. బ్రాహ్మణ సేవాసంఘ సమాఖ్య గూడూరు శాఖ ఉపాధ్యక్షుడు అనిమెళ్ళ శివకుమార్ మాట్లాడుతూ బ్రాహ్మణులు శుభకార్యాలు, వేడుకలు నిర్వహించుకునేందుకు డాక్టర్ సి.జనార్ధన్‌రెడ్డి, డాక్టర్ సి.రోహిణి, డాక్టర్ సి.ఆర్.రెడ్డి పేరుమీద అందించిన 8 లక్షల రూపాయలు, రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అందజేసిన 5లక్షల రూపాయలు, పలువురు దాతల సహకారంతో మూడు సంవత్సరాల క్రితం బ్రాహ్మణ భవనం నిర్మించడం జరిగిందని అన్నారు. ఇప్పుడు అదనంగా గదులు కట్టి ప్రారంభించామని, బ్రాహ్మణులు ఈ భవనాన్ని శుభకార్యాలకు, వేడుకలకు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ కార్యదర్శి చిట్టమూరు శ్రీనివాసరావు, కోశాధికారి లలిత, కమిటీ సభ్యులు పి.పురుషోత్తమరావు, కడివేటి రామమూర్తి, ప్రకాశం, వెంకటేశ్వర్లరావు, జి.శ్రీనివాసకుమార్, నరసింహన్, డి.రవీంద్రనాథ్‌రెడ్డి, చిల్డ్రన్స్ అసోసియేషన్ అధ్యక్షులు వల్లంకొండ వెంకటసుబ్బయ్య, డి.కోటేశ్వరరావు, ఎస్ఎల్ఎన్ స్వామి, రాంప్రసాద్, కిరణ్‌చక్రవర్తి, మయూరి శ్యాంయాదవ్, ఎం.మురళీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విశ్వహిందు పరిషత్ ఆధ్వర్యంలో
# అక్షింతల పంపిణీ కార్యక్రమం



అయోధ్య నుండి వచ్చిన అక్షింతలను గూడూరు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని విశ్వహిందూ పరిషత్ అధ్యక్షులు ఎమ్.మురళీరెడ్డి పేర్కొన్నారు. గత 16వ తేదీ నుండి అలఘునాథ స్వామి గర్భగుడిలో ఉంచి వాటికి పూజలు చేస్తూ గూడూరు వాసులకు అందుబాటులో ఉంచామని, స్వామి గుడికి ప్రతిఒక్కరూ వచ్చి అక్షింతలు తీసుకొని వెళ్ళాలని ఆయన కోరారు. ఈ కార్యక్ర మంలో కోశాధికారి రవిచంద్ర, కార్యదర్శి రమణయ్య, పట్టణ ప్రచారకులు ఆర్.వి.రావు, సేవా ప్రముఖ్ రాజగోపాల్‌రెడ్డి, ఏబీవీపి చిన్న, కె.రామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగులకు సరుకుల పంపిణీ



గూడూరులోని డిఎన్ఆర్ కమ్యూనిటీ హాలులో నవంబరు 26న ఓజిలి మండలం భట్లకనుపూరు గ్రామానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త గున్నంరెడ్డి మధుసూదన్‌రెడ్డి దాతృత్వంతో సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 'గున్నం చారిటబుల్ ట్రస్ట్ భరోసా' కార్యక్రమంలో భాగంగా వివిధ మండల శాఖలకు సంబంధించి రెడ్ల బంధువులు 25 మందికి ఫల సరుకులను పంపిణీ చేశారు. రోటరీ వెస్ట్ గూడూరు అధ్యక్షులు సనత్‌కుమార్ రెడ్డి, ప్రతినిధులు వాసుగౌడ్, ధనంజయరెడ్డి, సుబ్రహ్మణ్యం, నాగులు, బలరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# పారదర్శకత పాటించండి

ప్రజలకు రేషన్ సకాలంలో అందిస్తూ పారదర్శకత పాటించాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ అరుణ్ కుమార్ అధికారులను ఆదేశించారు. నవంబరు 29న తిరుపతి కలెక్టరేట్‌లో జిల్లాలోని తహశీల్దార్లు, పౌరసరఫరాల శాఖ అధికారులు, జాయింట్ కలెక్టర్ డి.కె.బాలాజీ, ఆర్డీవో కిరణ్ కుమార్‌లతో కమిషనర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెల 1వ తేదీ నుండి 17వ తేదీలోపు రేషన్ ప్రజలకు అందించాలని అధికారు లకు సూచించారు. ఈ సమావేశంలో అధికారులు రాజరఘువీర్, సుమతి తదితరులు పాల్గొన్నారు.

# అనుమతులు లేకుండా గుంతలు

గూడూరు పురపాలక అధికారులు అనుమతులు లేకుండా పట్టణంలో అడ్డగోలుగా గ్యాస్ పైపులైన్ల పేరుతో ఇష్టానుసారంగా గుంతలు తవ్వేస్తున్నా అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని తిరుపతి జిల్లా కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు పంటా శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. పలు ప్రాంతాల్లో ఉన్న గుంతల వద్ద ఆదివారం ఆయన నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలోని ప్రధాన వీధుల్లో గుంతలు తవ్వేస్తున్నారని, అంతంత మాత్రంగా ఉన్న రోడ్లను కూడా తవ్వేస్తుంటే అధికారులు, ప్రజాప్రతినిధులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం బాధాకరమన్నారు.

## బలహీనవర్గాల ఆశాజ్యోతి పూలే

సమాజంలో అసమానతలకు వ్యతిరేకంగా నిరంతరం కృషి చేసిన మహనీయుడు మహాత్మా జ్యోతిబాపూలే అని ఎమ్మెల్యే వరప్రసాదరావు అన్నారు. పూలే వర్ధంతిని పురస్కరించుకొని గత నెల 28న ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాశిన భాస్కర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# పూర్వ వైభవాన్ని సంతరించుకుంటున్న, ప్రభగిరిపట్నం ఆలయాలు

- భక్తులతో కళకళలాడుతున్న శ్రీ కైలాసనాథ, చెన్నకేశవ ఆలయాలు
- ఆలయాల అభివృద్ధికి బాటలువేస్తున్న దువ్వూరు మధుసూదన్‌రెడ్డి

***నెల్లూరుజిల్లా పొదలకూరు మండలంలో ఉన్న ప్రభగిరిపట్నం.. విజయనగర రాజుల ఏలుబడిలో ఎంతో ప్రాభవవైభవాలు కలిగిన పట్టణం. రాష్ట్రంలోనే మరెక్కడా లేనివిధంగా నాటికాలంలో నూటొక్క దేవాలయాలు, నూటొక్క కోనేర్లతో.. నిరంతరం ఆధ్యాత్మిక దివ్యకాంతులతో వెలుగొందు తుండేది. అయితే, కాలక్రమంలో ఆ కళంతా కోల్పోయింది. దేవాలయాలు శిథిలావస్తకు చేరుకున్నాయి. గుప్తనిధుల కోసం దుండగులు తవ్వకాలు చేసి దేవాలయాలన్నిటినీ నాశనం చేశారు. ఈ నేపథ్యంలో, ప్రభగిరిపట్నం లోని రెండు దేవాలయాలను పునరుద్ధరించేందుకు పల్లిపాడు నివాసి.. ప్రముఖ కాంట్రాక్టర్, గతంలో విద్యార్థినాయకునిగా అందరికీ సుపరిచితులు, ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉంటున్న దువ్వూరు మధుసూదన్‌రెడ్డి సంకల్పించి, ఆ ఆలయాలను జీర్ణోద్ధరణ గావించడం, గత పదహారేళ్ళుగా తన దైవభక్తి.. సేవాగుణంతో ఆ ఆలయాలకు పూర్వవైభవాన్ని తీసుకురావడం విశేషం.***

ప్రభగిరిపట్నంలోని శ్రీ కైలాసనాథస్వామి దేవాలయం.. బాణలింగ క్షేత్రం. చెన్నకేశవాలయం కూడా ఎంతో దివ్యశక్తి కలిగిన దేవాలయం. పురాతన కాలం నుంచి ఉన్న ఈ రెండు ఆలయాలను భక్తుల ఆకాంక్షలకు అనుగుణంగా తీర్చిదిద్ది, ధూపదీప నైవేద్యాలకు, స్వామివార్ల ఉత్సవాలకు ఎలాంటి లోటు లేకుండా చూస్తున్నారు మధుసూదన్‌రెడ్డి. తన సొంతనిధులు వెచ్చించి, ఎన్నో వ్యయప్రయాసలకోర్చి ఆ ఆలయాల అభివృద్ధికి ఆయన అంకితమయ్యారు. దాదాపు ఏడెకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ రెండు ఆలయాల అభివృద్ధికి ఒక కమిటీని కూడా ఏర్పాటుచేసి, ఆ ఆలయాలు తిరిగి భక్తులతో కళకళలాడేలా రూపుదిద్దారాయన. దైవదర్శనం కోరి వచ్చే భక్తులకు అవసరమైన సదుపాయలన్నీ వారు కల్పించారు. అందులోనూ, కోరని వారికి సైతం దయతో వరాలిచ్చే కొంగుబంగారంగా ప్రసిద్ధిచెందిన శ్రీ కైలాసనాథాలయంలో ఇటీవలే కల్యాణ మండపం కూడా నిర్మించి స్వామివారి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించి ఆయన తన భక్తిని చాటుకున్నారు. ఆలయ ప్రాంగణంలోని పాత గోశాలను ఆధునీకరించి, ఆ గోమాతలకు తమ సొంత భూముల నుంచి గ్రాసాన్ని కూడా అందేవిధంగా ఏర్పాట్లు చేశారు. ఆ గోశాలలో దాదాపు నూరు గోమాతలు ఉన్నాయి. వాటి ఆలనాపాలనా చూడడమే కాక, ఆ గోమాతలకు పూజలు చేసేందుకు కూడా ఆయన అన్ని సదుపాయాలు కల్పించడం విశేషం. తాను ఛైర్మెన్‌గా ఉంటూ, కమిటీ సభ్యులతో కలసి ఈ ఆలయాల అభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేపట్టామని, ఈ ఆలయాల నిర్వహణను క్రమబద్ధంగా చూసేందుకు దైవభక్తి, ధార్మిక సేవాభావం కలవారెవరైనా ముందుకు వస్తే, వారి సహకారంతో ఈ ఆలయాలను మరింత వైభవంగా నిర్వహించేందుకు అవకాశం ఉంటుందని, అలాంటి వారు తమను సంప్రదించవచ్చని ఈ సందర్భంగా మధుసూదన్‌రెడ్డి కోరారు.



## కైలాసనాథాలయంలో కార్తీక వేడుకలు



కార్తీకమాసం సందర్భంగా ప్రభగిరిపట్నంలోని పార్వతీదేవి సమేత శ్రీ కైలాసనాథ స్వామి దేవస్థానంలో నవంబరు 25 నుంచి 27వ తేదీ వరకు అంగరంగ వైభవంగా ఉత్సవాలు జరిగాయి. ఆలయంలో కొత్తగా నిర్మించిన కల్యాణవేదికపై స్వామివారి కల్యాణోత్సవాన్ని 25న కన్నులపండువగా నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. 26న ఉట్టి మహోత్సవం, వసంతోత్సవం వైభవంగా చేపట్టారు. నవంబరు 27న అరుణాచల క్షేత్రంలో వలెనే ఇక్కడ కూడా భక్తిశ్రద్ధలతో ఆకాశదీపం వెలిగించి కార్తీకదీపాలతో ఈ కోవెలను వెలుగుల దివ్వెలా దేదీప్యమానం చేశారు. ఆలయంలో కొలువైవున్న శ్రీ కైలాసనాథునికి, శ్రీ అయ్యప్పస్వామి, శ్రీ భద్రకాళి సమేత వీరభద్రస్వామికి ప్రభ, జ్వాలాతోరణం వేడుకగా నిర్వహించారు. అనంతరం స్వామివారికి వైభవంగా పల్లకిసేవ చేశారు. అదేరోజు సాయంత్రం ఇందుకూరుపేట మండలం పల్లిపాడు గ్రామానికి చెందిన శ్రీ ధర్మశాస్త్ర భక్తబృందం వారిచే శ్రీ అయ్యప్పస్వామి భజన కార్యక్రమం చేపట్టారు. భక్తుల కోలాటం ప్రదర్శనలతో ఆలయప్రాంగణం సందడిగా మారింది. పెద్దఎత్తున ఈ ఉత్సవాల్లో భక్తులు పాల్గొన్నారు. దేవస్థానాల కమిటీ ఛైర్మెన్ దువ్వూరు మధుసూదన్‌రెడ్డితో పాటు కమిటీ సభ్యులు, ధర్మకర్తలు ఈ వేడుకలను పర్యవేక్షించారు.

## టూకీగా...



### శ్రీ రంగనాథునికి తిరుమంజన సేవ

నెల్లూరులోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ రంగనాథాలయంలో నవంబరు 27న కృత్తిక పౌర్ణమి సందర్భంగా ఆలయ అర్చకులు స్వామివారికి వైభవంగా తిరుమంజన సేవ చేశారు. అనంతరం స్వామివారికి-అమ్మవార్లకు పేట ఉత్సవం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఇఓ డబ్బుగుంట వెంకటేశ్వర్లు పర్యవేక్షించారు.

### తరుణవాయిలో పశువిజ్ఞాన బడి

సంగం మండలం తరుణవాయిలో నవంబరు 27న పశు విజ్ఞాన బడి నిర్వహించారు. పశు సంవర్ధకశాఖ జేడీ మహేశ్వరుడు పాల్గొని పెయ్యదూడల ఉత్పత్తిని పెంచితే పాల ఉత్పత్తిని పెంచుకోవచ్చని, పాడి రైతులు ఆ దిశలో అవగాహన కలిగించుకుని తగుచర్యలు తీసుకోవాలని చెప్పారు. డిఎల్‌డిఓ ఇఓ సోమయ్య, ఏ.డి జయచంద్ర, డాక్టర్ సురేష్‌బాబు పాల్గొన్నారు.

### మినుము పంటను పరిశీలించిన శాస్త్రవేత్తలు

కొండాపురం మండలంలోని తూర్పుఎర్రబెల్లి, ఉప్పులూరు గ్రామాల్లో వేసివున్న మినుము పంటను వ్యవసాయ శాస్త్రవేత్తలు నవంబరు 27న పరిశీలించారు. నెల్లూరులోని కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డా.జివిల్ శివజ్యోతి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డా. కిరణ్‌కుమార్‌రెడ్డి, డా. డి.విజయకుమార్ పాల్గొని రైతులకు తగు సూచనలిచ్చారు.

### మద్దిలమడుగు అయ్యప్ప ఆలయానికి వెండికిరీటం

రాపూరు పంచాయతీలోని మద్దిలమడుగు గ్రామంలో వెలసివున్న శ్రీ మహావిష్ణు అయ్యప్పస్వామి దేవాలయానికి రాపూరుకు చెందిన భక్తుడు మెంటా వెంకటరత్నం, తన తండ్రి పెంచలయ్య జ్ఞాపకార్థం నవంబరు 27న వెండి కిరీటం సమర్పించారు. ఆలయంలో ప్రత్యేకపూజలు చేసిన అనంతరం, ఆ కిరీటాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు.

### గొల్లకందుకూరులో వికసిత్ భారత్ సంకల్పయాత్ర

నెల్లూరు రూరల్ మండలంలోని గొల్లకందుకూరులో నవంబరు 27న రూరల్ మండల ఇన్‌చార్జి ఎంపీడీఓ శైలేంద్ర కుమార్ ఆధ్వర్యంలో 'వికసిత్ భారత్ సంకల్పయాత్ర' జరిగింది. పీఎం కిసాన్, తదితర కేంద్రప్రభుత్వ పథకాల గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఏపీఎం సరిత, ఉద్యానశాఖ అధికారి ప్రసన్న, వీఏఏలు సురేష్, వర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

## కాలధర్మం

### అల్లారెడ్డి రవికుమార్‌రెడ్డి



చెన్నైలోని సవేరా హోటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ అల్లారెడ్డి రవికుమార్‌రెడ్డి నవంబర్ 25వ తేదీ శనివారం నాడు తమ 66వ యేట తుది శ్వాస విడిచారు. ఆయనకి భార్య ప్రియంవద, కుమారుడు తరుణ్, కుమార్తె శ్రావ్య ఉన్నారు. గూడూరు వాస్తవ్యులు స్వర్గీయ అల్లారెడ్డి శ్యాంసుందరరెడ్డి – జయలక్ష్మమ్మల రెండవ సంతానం రవికుమార్‌రెడ్డి. చెన్నై మహానగరంలో 5 దశాబ్దాలకిపైగా ప్రఖ్యాతిగాంచిన సవేరా స్టార్ హోటల్ అల్లారెడ్డి కుటుంబానికి చెందిందే. తమ నాన్న, చిన్నాన్నల సారధ్యంలో ఏర్పడిన అద్భుత ఆతిధ్య సముదాయానికి అనుసంధానంగా అమరావతి, కారైకుడి, మాల్గుడి వంటి రెస్టారెంట్లతో పాటు అనేక ఆహార విభాగాలను ప్రారంభించిన ఘనత రవికుమార్‌రెడ్డిది.

ఇంజనీరింగ్ పట్టా పుచ్చుకున్న రవికుమార్‌రెడ్డి, ఆతిథ్య రంగంలో కూడా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పరిచయంచేసి తమ అతిథులకు నాణ్యమైన సేవలు అందించడంలో అనేక సంస్కరణలు చేపట్టారు. సవేరా సంస్థల అభివృద్ధికోసం కీలక నిర్ణయాలు చేసేటప్పుడు సముచిత సలహాలిచ్చి సంస్థల పురోగతిలో రవికుమార్‌రెడ్డి ముఖ్య భాగస్వామ్యం వహించేవారు. సౌమ్యుడిగా, స్నేహభావంతో ఉంటూ తమ సిబ్బందితో అత్యంత సన్నిహితంగా మెదిలేవారు. ఉద్యోగి, యజమాని అన్న తారతమ్యం లేకుండా తమ సంస్థల ఉద్యోగులతో కలిసిపోయి తమ సంస్థల పటిష్టత కోసం కృషి చేసేవారు.

రవికుమార్‌రెడ్డి సోదరుడు విజయకుమార్‌రెడ్డి 2019 మార్చిలో ఆకస్మిక గుండెపోటుతో కాలం చేశారు. విజయకుమార్‌రెడ్డి తరువాత సవేరా సంస్థలకి రవికుమార్‌రెడ్డి మేనేజింగ్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తుండగా, ఆయన వదిన నీనారెడ్డి జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్‌గా సంస్థ కార్యకలాపాలు పర్యవేక్షిస్తున్నారు. కొంతకాలం స్వల్ప అనారోగ్యంతో ఉన్న రవికుమార్‌రెడ్డి గత శనివారం తుదిశ్వాస విడిచారు. అల్లారెడ్డి కుటుంబసభ్యులకి ప్రగాఢ సానుభూతిని తెలుపుతోంది 'లాయర్'.

## 'గ్రీన్ బిల్డింగ్ కాంగ్రెస్-2023' సదస్సులో..

# మెరిసిన శ్రీసిటీ

దేశవిదేశాల్లో ఖ్యాతిపొందిన 210 పరిశ్రమలకు నిలయంగా గ్లోబల్ బిజినెస్ హబ్‌గా అవతరించిన శ్రీసిటీ, స్థిరమైన అభివృద్ధికి నిదర్శనంగా నిలిచి అందరి ప్రశంసలు అందుకుంటోంది. శ్రీసిటీలో హరిత వనాలు, పునరుత్పాదక ఇంధనం, నీటి సేకరణ, వ్యర్థాల నిర్వహణ, జీవవైవిధ్య పరిరక్షణ వంటి పద్ధతులను అనుసరిస్తూ, ఆర్థిక, పర్యావరణ, సామాజిక ప్రయోజనాలను ప్రోత్సహించడం ద్వారా స్థిరమైన పట్టణాభివృద్ధికి నిదర్శనంగా నిలవడం ద్వారా 'గ్రీన్ బిల్డింగ్ కాంగ్రెస్–2023' సదస్సులో శ్రీసిటీ తన ప్రాముఖ్యతను మరోసారి చాటుకుంది. 'కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సిఐఐ) ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ (ఐజిబిసి)–తమిళనాడు ప్రభుత్వం సంయుక్త ఆధ్వర్యంలో చెన్నైలో నవంబరు 23 నుండి 25వతేదీ వరకు పెద్దఎత్తున సదస్సు జరిగింది. ఈ సదస్సులో అనేక పరిశ్రమల ప్రముఖులు, విధానాల రూపకర్తలు, నిపుణులు పాల్గొని స్థిరమైన పద్ధతులు మరియు హరిత నిర్మాణ కార్యక్రమాలలో తాజా పురోగతులపై చర్చించారు. జీరోకార్బన్ ఉద్గార లక్ష్యాలను సాధించే దిశగా భారతదేశ ప్రయాణంలో కీలకపాత్ర పోషిస్తున్న ఐజిబిసి దేశంలో మొట్టమొదటి 'నెట్ జీరో కార్బన్' (నికర జీరో కార్బన్) రేటింగ్ సిస్టమ్‌ను సదస్సులో ప్రకటించింది. శ్రీసిటీ, శ్రీసిటీలోని డైకిన్, బ్లూ స్టార్, థర్మాక్స్, హంటర్‌డగ్లస్ తదితర పరిశ్రమలు ఈ సదస్సులో పాల్గొన్నాయి. పచ్చదనం, తక్కువ కార్బన్ ఉద్గార భవనాలు, ఉత్పత్తులు, సాంకేతికతలపై జరిగిన ఈ ఎక్స్‌పోలో, శ్రీసిటీ పర్యావరణ అనుకూల మౌళిక సదుపాయాలు, అక్కడ అమలు చేస్తున్న ఇతర అనేక రకాల హరిత కార్యక్రమాలను ప్రదర్శించారు. అలాగే పరిశ్రమలు, పర్యావరణ ప్రభావాన్ని తగ్గించడానికి ఇంధన–సమర్థవంతమైన సాంకేతికత, అధునాతన ఉత్పత్తి పద్ధతుల ద్వారా రూపొందించిన తమ ప్రాజెక్టు నమూనాలను ప్రదర్శించాయి. ఈ



సదస్సులో శ్రీసిటీలోని బ్లూ స్టార్ పరిశ్రమ ఉత్తమ పర్యావరణ అనుకూల స్మార్ట్ డిజైన్ ఉత్పత్తి కేంద్రంగా ఎంపికై, ఐజిబిసి గోల్డ్ రేటింగ్‌ను పొందడం విశేషం.

ఈ కార్యక్రమంలో శ్రీసిటీ పాల్గొనడంపై శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి సంతోషం వ్యక్తం చేస్తూ, ఐజిబిసి గోల్డ్ రేటింగ్ గుర్తింపు లభించినందుకు బ్లూ స్టార్ బృందానికి అభినందనలు తెలిపారు. నికర–సున్నా కార్బన్ ఉద్గార లక్ష్యాలు, గ్రీన్ బిల్డింగ్ డిజైన్‌లు, సుస్థిరత పద్ధతులు, విద్యుత్ మరియు నీటి సంరక్షణ వినూత్న విధానాల పట్ల నిబద్ధతను ప్రదర్శించడానికి ఈ సదస్సు శ్రీసిటీకి మంచి వేదికగా ఉపయోగపడిందని అన్నారు. సుస్థిరతా చర్యలను ముమ్మరం చేయడం ద్వారా శ్రీసిటీ భవిష్యత్తులో పారిశ్రామిక ప్రకృతి సంరక్షణకు సంబంధించి ఉత్తమ అభ్యసన మోడల్‌గా నిలుస్తుందన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో శ్రీసిటీ జనరల్ మేనేజర్(పర్యావరణం) డాక్టర్ పి.వెంకటేశ్వరన్ పాల్గొన్నారు.

# కళ్యాణ వైభవం...!

## వీరేష్ - సంజన



చెన్నైలోని విజయా ఆసుపత్రి బ్లడ్ బ్యాంక్ మాజీ చీఫ్ డాక్టర్ కొండూరు ప్రభాకర్-షకీలా దంపతుల ద్వితీయ కుమార్తె **సంజన - వీరేష్ చంద్రదేవ్** (విశాఖపట్నం మాజీ ఎంపీ, కురుపం జమిందార్ కుటుంబానికి చెందిన వైరిచెర్ల ప్రదీప్‌కుమార్ దేవ్ - సుదానిదేవి దంపతుల పెద్ద కుమారుడు)ల కళ్యాణం నవంబర్ 25న చెన్నైలో జరిగింది. ఈ కళ్యాణ వేడుకకు మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, మాజీ కేంద్ర మంత్రి అశోక్ గజపతిరాజు, ఒడిశా మంత్రి ఉషాదేవి, మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, మాజీ మంత్రి పనబాక లక్ష్మీ, ఎపి హైకోర్టు రిటైర్డ్ జడ్జి సోమయాజులుతో పాటు చెన్నైకి చెందిన పలువురు ప్రముఖ వ్యాపారవేత్తలు, వైద్యులు, సాహిత్య ప్రముఖులు హాజరై కొత్త దంపతులను దీవించారు.

## సునీల్ - సౌమ్య



కావలి వాస్తవ్యులు మర్రిబోయిన వెంకటస్వామి - పుష్పల కుమారుడు **వెంకట సునీల్‌కుమార్ - సౌమ్య** (హైదరాబాద్ వాస్తవ్యులు అందె వెంకటేశ్వర్లు - సుగుణల కుమార్తె)ల వివాహం నవంబర్ 22వ తేదీ హైదరాబాద్‌లో జరిగింది. కొత్త దంపతులకు 'లాయర్' శుభదీవెనలు.

# చిరస్మరణీయులు.. వెన్నెలకంటి రాఘవయ్య

### - ఆదిమజాతి సేవక్‌సంఘ్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ పొట్లూరి

ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, పద్మభూషణ్ వెన్నెలకంటి రాఘవయ్య గిరిజనులకు, యానాదుల సంక్షేమానికి చేసిన సేవలు ఏనాటికీ మరచిపోలేమని, ఆయన చిరస్మరణీయులని ఆంధ్ర రాష్ట్ర ఆదిమజాతి సేవక్‌సంఘ్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ పొట్లూరి లక్ష్మీప్రసాద్ అన్నారు. వెన్నెలకంటి రాఘవయ్య 42వ వర్ధంతి సందర్భంగా ఇటీవల నెల్లూరు లోని సుబేదారుపేటలోని వెన్నెలకంటి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన వెన్నెలకంటి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. గిరిజన జాతుల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలు అపూర్వమని కొనియాడారు. యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసీ పెంచలయ్య మాట్లాడుతూ, నెల్లూరు నగరంలో వెన్నెలకంటి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు పొట్లూరి శ్రీనివాసులు, చేవూరు ప్రభాకర్‌రావు, ప్రసాద్, ఎస్.రాజేశ్వరి, పి.లావణ్య, పొట్లూరి రమణయ్య, ఇండ్ల రవి, బిఎల్ శేఖర్, చెంచయ్య, శీనయ్య తదితరులు పాల్గొన్నారు.

# కళ్యాణమండపాల్లో చోరీలు చేసే.. దొంగ దొరికాడు

- **రూ. 13.15 లక్షల సొమ్ము స్వాధీనం**

కళ్యాణమండపాల్లో పెళ్ళిళ్ల సందట్లో నగలు అపహరించుకుపోయే ఘరానా దొంగ ఎట్టకేలకు పోలీసులకు దొరికిపోయాడు. నవంబరు 28న నెల్లూరు నగర డిఎస్పీ శ్రీనివాసరెడ్డి నిందితుల వివరాలను విలేకరులకు వెల్లడించారు. స్థానిక పొదలకూరురోడ్డులోని లక్ష్మీ నరసింహపురంలో నివాసం ఉంటున్న బషీర్ ఈ దొంగతనాలకు పాల్పడేవాడని, పెళ్ళిమండపాలే లక్ష్యంగా చేసుకుని నగరంలోని పలుచోట్ల చోరీలు చేశాడని, బాధితుల ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేశామని ఆయన తెలిపారు. సీసీ ఫుటేజీలు పరిశీలించి సాంకేతిక పరిజ్ఞానంతో బషీర్‌ను నిందితునిగా గుర్తించినట్లు చెప్పారు. బారాషహీద్‌దర్గా ప్రాంతంలో నవంబరు 28న నిందితుని అరెస్ట్‌చేసి పోయినసొత్తును రాబట్టామన్నారు నగరంలోని పిచ్చిరెడ్డి కల్యాణమండపంలో చోరీ చేసిన 133.050 గ్రాముల బంగారునగలు, అదే కల్యాణమండపంలో మరోసారి దొంగిలించిన 44.200 గ్రాముల ఆభరణాలు, ఏఎల్‌రావు ఫంక్షన్‌హాలులో అపహరించిన 82.470 గ్రాముల నగలు, రాఘవ కల్యాణమండపంలో కాజేసిన 299.600 గ్రాముల వెండి వస్తువులు మొత్తం 13,15,930 రూపాయల విలువచేసే సొత్తును నిందితుని నుంచి స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ కేసును ఛేదించిన దర్గామిట్ట ఇన్స్‌పెక్టర్ వీరవెంకటసుబ్బారావు, క్రైమ్‌పార్టీ కానిస్టేబుల్స్ ఖాజారహంతుల్లా, షంషుద్దీన్, శామ్యూల్, వేణులను డీఎస్పీ అభినందించారు.

# ఆట మొదలయ్యిందా?

(మొదటి పేజీ తరువాయి)

చంద్రబాబు, కళ్యాణ్‌బాబుల 'కలిసుందాం రా' స్క్రిప్ట్ ఇంకా తుదిమెరుగులు దిద్దుకోకముందే ప్రజాతీర్పు కోసం వైసీపీ ముందడుగు వేస్తుందా...? ఈ పరిణామాలతో జగన్ శాసనసభను 'రద్దు' చేసే దిశగా అడుగులు పడతాయా..? తెలంగాణ ఎన్నికల ఫలితాలు ఆంధ్ర రాజకీయాలపై ప్రభావం చూపిస్తాయా...? పై ప్రశ్నలన్నిటికీ విశ్లేషకుల నుంచి అవుననే సమాధానమే వినిపిస్తుంది. ఏమో "గుఱ్ఱం ఎగరావచ్చు" అన్నట్లుగా తెలంగాణ తీర్పు వచ్చాక శాసనసభను జగన్ రద్దు చేసినా ఆశ్చర్యపోనవసరం లేదంటున్నారు విశ్లేషకులు.

## బాబు అరెస్టు... ఆ తరువాత!

చంద్రబాబు అరెస్టు అయిన తరువాత వైసీపీ శ్రేణులు విజయోత్సవ సంబరాలు చేసుకున్నారు. చంద్రబాబు రాజకీయ అనుభవాన్ని, పరిపాలనలో ఉన్న సీనియారిటీని, వివిధ స్థాయిలలో ఆయనకి ఉన్న పలుకుబడిని అన్నింటినీ పక్కనపెట్టి, బాబుని కారాగారానికి పంపించడంలో న్యాయమూర్తులు నిష్పక్షపాతంగా వ్యవహరించారని సంతోషపడ్డారు. కనీసం ఆరునెలలన్నా ఆయన జైల్లోనే ఉంటారని వైసీపీ నాయకులు, జగన్ అభిమానులు భావించారు. కానీ, అనుకోకుండా యాభై రెండు రోజులకే ఆయనకి తాత్కాలిక బెయిలు వచ్చింది. నిబంధనలతో కూడిన ఆ బెయిలు గడువు ముగియక ముందే సాధారణ బెయిలు కూడా వచ్చేసింది. ఇది ఆ పార్టీ వర్గాలకి మింగుడుపడలేదు. బాబుకి సాధారణ బెయిలు వచ్చిన వెంటనే ప్రభుత్వ ముఖ్య సలహాదారు వైసీపీ నాయకుడు సజ్జల కోర్టులను, న్యాయమూర్తులను తప్పుబట్టారు. బాబుకి బెయిలు మంజూరుచేసే విషయంలో హైకోర్టు తన పరిధిని దాటిందని వ్యాఖ్యానించారు. అయితే, పదేళ్లుగా బెయిలుపై బయట ఉన్న తమ నాయకుడి సంగతి మర్చిపోయి, బాబు బెయిలుపై ఆయన స్పందించడం ఏమిటని ప్రతిపక్షాలు ధ్వజమెత్తాయి. నరసాపురం పార్లమెంటు సభ్యుడు ఒకడుగు ముందుకేసి జగన్ బెయిలు రద్దు చేయాలంటూ ఏకంగా సుప్రీం కోర్టు మెట్లు ఎక్కారు. రఘురామరాజు అభ్యర్ధనని పరిగణనలోకి తీసుకున్న సుప్రీం కోర్టు సిబిఐతో పాటు జగన్‌మోహన్‌రెడ్డికి కూడా నోటీసులు ఇచ్చింది. జనవరి 3, 2024లోపు అఫిడవిట్లు దాఖలు చేయమంది. కేసు ఆలస్యంపై వారిని వివరణ అడిగింది. ఇది అత్యంత కీలక పరిణామంగా విశ్లేషకులు పేర్కొంటున్నారు. మరో రెండు లేదా మూడు నెలల్లో ఎన్నికల నోటిఫికేషన్ వస్తుంది. ఈ తరుణంలో విచారణలో జాప్యం జరుగుతున్న జగన్ పాత కేసుల వ్యవహారాన్ని కెలికి, ఆయన బెయిలు రద్దు చేయమని కోరడం జగన్‌మోహన్‌రెడ్డికి, ఆయన పార్టీకి తలనొప్పి వ్యవహారమే అని విశ్లేషకులు అంటున్నారు. సుప్రీం అడిగిన దానికి వారిని సంతృప్తి పరచేలా జగన్, సిబిఐ సమాధానాలు చెప్పకపోతే రఘురామరాజు అభ్యర్ధన విషయంలో ముందుకు వెళ్లే అవకాశాలు లేకపోలేదు. తాజాగా బాబు బెయిలు రద్దు చేయాలని ఆంధ్ర ప్రభుత్వం అత్యున్నత న్యాయస్థానంలో చేసిన అభ్యర్ధనని కూడా సుప్రీం కోర్టు తోసిపుచ్చింది. 17ఏపై తుదితీర్పు వెలువడే వరకూ నిర్ణయం ప్రకటించేది లేదంటూ డిసెంబర్ 8వ తేదీకి కేసుని వాయిదావేసింది.

## రాష్ట్రంలో మారుతున్న పరిస్థితులు

ఓ వైపు వైసీపీ ప్రభుత్వం బాబుపై వరుస కేసులు పెడుతూ ఆయనని ఊపిరి తిప్పుకోకుండా చేస్తుంటే, మరోవైపు టీడీపీ, జనసేన, బీజేపీలు జగన్‌పై ముప్పేట దాడికి సంసిద్ధమవుతున్నాయి. ఇసుక, మద్యం, గనులు అంతటా అవినీతిమయం అంటూ వైసీపీపై ధ్వజమెత్తుతూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు నందమూరి ఆడపడుచు పురందేశ్వరి ఊరూరా తిరుగుతోంది. తండ్రి అరెస్టుతో మధ్యలోనే ఆపేసిన యువగళం పాదయాత్రని నవంబర్ 27వ తేదీ నుండి లోకేష్ మళ్ళీ మొదలుపెట్టారు. ప్రజాక్షేత్రంలో తిరిగి వైసీపీ వైఫల్యాలను ఎత్తి చూపడానికి, తనపై బనాయించిన కేసులపై వివరణ ఇవ్వడానికి డిసెంబర్ 1వ తేదీ నుండి చంద్రబాబు బయలుదేరుతున్నారని టీడీపీ శ్రేణులు ప్రకటించాయి.

## కింకర్తవ్యం...!

ఇప్పుడు వైసీపీ ముందు అనేక సవాళ్ళు ఉన్నాయి. తమపై మూకుమ్మడి దాడికి ప్రతిపక్షాలన్నీ ఏకమై సిద్ధమవుతున్నా తమకేం భయం లేదని వైసీపీ నేతలు చెప్తున్నారు. సింహం ఎప్పుడూ ఒంటరిగానే పోరాడుతుందని ఆ పార్టీ శ్రేణులు గంభీరంగా చెప్పుకుంటున్నారు. కానీ, లోలోపల వారికున్న భయాలు వారికున్నాయని విశ్లేషకులు అంటున్నారు. సుప్రీం కోర్టు చంద్రబాబుకి 17ఏ వర్తిస్తుందని తీర్పు చెప్పినా, బాబు బెయిలు విషయంలో రాష్ట్ర ప్రభుత్వ అభీష్టానికి వ్యతిరేకంగా నిర్ణయం తీసుకున్నా, రఘురామరాజు అభ్యర్ధనని మన్నించి జగన్ బెయిలు విషయంలో ఆర్ఆర్ఆర్‌కి అనుకూలంగా వ్యవహరించినా, పరిస్థితి ఏమిటన్నది వైసీపీ వర్గాలు ఆందోళన చెందుతున్నట్లు స్పష్టమవుతోంది. వీటితో పాటు రేపు తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే తమకు నష్టమే అన్నది కూడా వైసీపీ నాయకుల అంచనాగా ఉంది. ఇలా... అన్ని వైపుల నుంచి తమకి వ్యతిరేక పరిణామాలు చోటు చేసుకుంటే కింకర్తవ్యం అనే విషయమై నాయకులలో 'మేధో మధనం' జరుగుతున్న సూచనలు కనిపిస్తున్నాయి.

## అసెంబ్లీ రద్దే పరిష్కారం!

సుప్రీం కోర్టు, ప్రతి పక్షాలు, తెలంగాణ ఎన్నికలు... ఇలా అన్ని వైపుల నుంచి సమస్యలు ఎదురైతే, అసెంబ్లీని రద్దు చేయడమే జగన్‌మోహన్‌రెడ్డి ముందున్న ప్రత్యామ్నాయం అని రాజకీయవర్గాలలో ఓ చర్చ నడుస్తోంది. తన బెయిలు విషయంలో జగన్ సుప్రీం కోర్టు వద్ద సమయం తీసుకోవాలి. ఇంకా పూర్తిస్థాయి ఒప్పందాలు కుదుర్చుకోని తెలుగుదేశం, జనసేన పార్టీలకి చెక్‌పెట్టాలి. క్రమేణా తన మీద మాటల బాణాలు స్థాయి పెంచుతున్న పురందేశ్వరిని కట్టడి చేయాలి. బటన్ నొక్కే పథకాల కోసం ఏర్పడే ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కోవాలి. ఇలాంటి సవాళ్ళు అనేకం ఇప్పుడు జగన్‌మోహన్‌రెడ్డి ముందు ఉన్నాయి. వీటన్నిటినీ అధిగమించాలంటే అసెంబ్లీ రద్దు ఒక్కటే మార్గమన్నది పరిశీలకుల అభిప్రాయం. డిసెంబర్ 3వ తేదీ తెలంగాణ ఫలితాల తరువాత జగన్ నిర్ణయంలో స్పష్టత వస్తుందని విశ్లేషకుల భావన. తెలంగాణ ఎన్నికల తీర్పు తరువాత భాజపా కూడా ఆంధ్ర విషయంలో తన వ్యూహం బయటపెడుతుందని, అప్పటివరకు ప్రేక్షకపాత్ర పోషిస్తుందని చెప్తున్నారు. తెలంగాణ ఫలితాల మీద, భాజపా దయాదాక్షిణ్యాలమీదా ఆంధ్రా భవిష్యత్తు ఆధారపడి ఉందన్న అభిప్రాయం మాత్రం సర్వత్రా వ్యక్తమవుతోంది. మొత్తంమీద డిసెంబర్ 3 తరువాత ఆంధ్రలో అసలైన ఆట మొదలవుతుందన్నది రాజకీయవర్గాల మాట!

# కార్పొరేషన్ ఎదుట కార్మికుల ధర్నా

మునిసిపల్ కార్మికులందరినీ పర్మనెంట్ చేయాలని, ప్రమాదవశాత్తూ మరణించిన కార్మికుల కుటుంబాలకు రూ. 10లక్షల వంతున ఎక్స్‌గ్రేషియో చెల్లించాలని, సమాన పనికి సమానవేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఏపీ మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటియు అనుబంధం) ఆధ్వర్యంలో నవంబరు 25న కార్మికులు పెద్దఎత్తున నెల్లూరులోని కార్పొరేషన్ కార్యాలయం వద్ద ధర్నాందోళన చేశారు. ఈ ఆందోళనలో సిపిఎం నాయకుడు కత్తి శ్రీనివాసులు, సీఐటియు నాయకులు నాగేశ్వరరావు, గోపాల్, కార్మికులు పాల్గొన్నారు.

# ‘నేత’లకు క్యారెక్టర్ ఉండాలా?.. వద్దా!?

ఇదే ఇప్పుడు మన ముందున్న సమస్య. “మన” అంటే...., మన ఆంధ్ర సమస్య అని కాదు... లేదా మన తెలంగాణ అని కాదు. మన దేశంలో ప్రజా జీవనం ఎదుర్కొంటున్న సమస్య అని అర్థం. పబ్లిక్ లైఫ్‌లోకి ఇప్పటికే వచ్చిన వారికి...., ముందు ముందు వద్దామని సరదా పడేవారికి, వారి కుటుంబాలకు.... ఒక నిబద్ధత, నడవడిక, నైతికత, విశ్వసనీయ ప్రవర్తన, మొదలైన లక్షణాలు ఉండాలా... వద్దా?

ఏ గడ్డి అయినా సరే కరిచేసి పోగేసిన ధనరాశులను, ఓటర్ల మోహాన కుమ్మరించేసి, మందులో ముంచి, తప్పుడు ప్రచారాలు చేసి, రకరకాల బహుమతులు ఎర వేసి..., జనాల అమాయక, అజ్ఞాన, నిరక్షరాస్యత ఆధారంగా కుల, మత, ప్రాంత భావోద్వేగాలను రెచ్చగొట్టి, చట్ట సభలకు ఎన్నికైతే... ఆ ఎన్నిక ప్రజాభిప్రాయాన్ని ప్రతిబింబిస్తుందా? అలా ‘ఎన్నికయ్యాం’ అనిపించుకుని, ప్రభుత్వ అధికారం చేజిక్కించుకుంటే(కబ్జా చేస్తే ).... సమాజపు నడక ఎలా ఉంటుంది?

ఇదిగో... ఇప్పుడు మనకు కనపడుతున్న దానిలాగా ఉంటుంది.

ఒక్క ప్రభుత్వ అధికారాన్ని చేజిక్కించుకుంటే.... ఆ రాష్ట్ర (దేశ) భౌగోళిక సరిహద్దుల లోపల – ఆకాశానికి, భూమికి మధ్య కంటికి కనిపించే, కనిపించని సమస్త వనరులనూ, వాటి దుర్వినియోగ అవకాశాలనూ చేజిక్కించుకున్నట్టే.

అందుకే, క్యారెక్టర్– నడవడిక లేని వారి చేతుల్లో ప్రభుత్వాధికారం చిక్కుకు పోతే.... వ్యవస్థలు నిలువునా అదుపుతప్పుతాయి. దోచుకున్న వారికి దోచుకున్నంత మహాదేవ! అన్నట్టుగా సమాజం తయారవుతుంది.

అరాచకాలకు ఆకాశమే హద్దు. ఏ స్థాయిలోనూ అదుపు, నియంత్రణ ఉండదు. చెప్పే వారు ఉండరు. చెబితే వినేవారు ఉండరు. “వాళ్లు దోచేస్తుంటే... మనం ఖాళీగా కూర్చోవడం ఎందుకు...?” అనే ధోరణి సమాజంలోని అన్ని వ్యవస్థల్లోనూ పెరిగిపోతుంది.

ఈ మొత్తం అరాచకాలకు, అక్రమాలకు, దోపిడీలకు, సామాజిక స్వైర విహారాలకు.... కేంద్ర బిందువు ఎవరు?

“ప్రజా ప్రతినిధి.” సర్వ అక్రమాలకూ పాల్పడి ‘గెలిచాం’ అనిపించుకున్న ‘ప్రజాప్రతినిధి’.

వ్యవస్థల మనుగడకు నాయకత్వం, మార్గదర్శకత్వం వహించవలసిన ‘నాయకుడు’ స్థానంలో ఉండవలసిన వారు ప్రజాప్రతినిధే కదా!

సర్వ అక్రమ, అరాచక, ధన పిశాచ, కుల–మత–ప్రాంత దుష్ట భావనల మయంగా ఆ ‘ప్రజా ప్రతినిధి’ తయారైతే.... మార్గదర్శకత్వం చేయవలసిన వివిధ సామాజిక శ్రేయోవ్యవస్థలు ఎలా ఉంటాయి? ‘ప్రజా ప్రతినిధి’కి ప్రతిరూపాల్లా ఉంటాయి.

ఈ ధోరణి అప్రతిహతంగా కొనసాగితే పౌర సమాజం ఎక్కువ కాలం గౌరవంగా..., ప్రశాంతంగా, చట్టబద్ధంగా మనగలుగుతుందా?

ఈ పోకళ్ళకు విరుగుడు చర్యలు తీసుకోవడం కుదరదా....! అని ఆశ్చర్యపోవలసిన పని ఏమీ లేదు.

పెరుగుట.... విరుగుట కొరకే అనే చక్కని సామెత ఉంది కదా!

ఈ సామాజిక అరాచకం... ఫెళ ఫెళమంటూ విరిగిపోయేంత స్థాయికి పెరిగిపోయింది.

ఈ ‘ప్రజా ప్రతినిధి’ అరాచకాన్ని అదుపు చేయగలిగితే, వ్యవస్థలు అన్నీ గాడిన పడతాయి. సమాజపు కష్ట సుఖాలను పట్టించుకుంటాయి. నేరస్థులను పోలీసు వ్యవస్థ ఎక్కడ ఉంచాలో అక్కడే ఉంచుతుంది. అధికార వ్యవస్థ ఎలా పనిచేయాలనే ఉద్దేశంతో దానిని సృష్టించారో... అది అలానే పనిచేస్తుంది. శాసన వ్యవస్థ.... ప్రజాభిలాషను ప్రతిబింబిస్తుంది. అప్పుడు... ఏడాదికి ఓ ఇరవై రోజులు ‘రాజ్యాంగ మొక్కుబడి’గా కాకుండా ఏడాదికి ఓ వంద రోజులైనా సమావేశమై పాలనలో లోటుపాట్లు, మంచి చెడ్డలు చర్చించగలుగుతుంది.

మార్పు ఎలా?

ఓ పెద్ద భవనంలో విద్యుత్తు మెయిన్ స్విచ్ ఆఫ్‌లో ఉంటే... ఆ భవనంలో ఒక్క బల్బు కూడా వెలగదు. వెలగని బల్బును పట్టుకుని ఎంత పిసికినా వెలగదు.

ఆ భవనానికి విద్యుత్తు సరఫరా చేసే ‘మెయిన్’ మీటర్ ఎక్కడ ఉందో చూసి, దానిని ‘ఆన్’ చేస్తే భవనంలోని బల్బులన్నీ ఒక్కసారిగా వెలుగుతాయి. ఫ్యాన్‌లు సక్రమంగా తిరుగుతాయి. ఫ్రిజ్‌లు, ఏసీలు పని చేస్తాయి. గీజర్లు వేన్నీళ్లు అందిస్తాయి. అంటే... దేని పని అది చేస్తుంది అన్న మాట.

అలాగే, మోరల్ క్యారెక్టర్... నైతిక ప్రవర్తన కలిగిన ప్రజాప్రతినిధి చేతిలో అధికారం ఉంటే.. వ్యవస్థలు అన్నీ అవి చేయవలసిన పనులనే అవి చేస్తాయి.

అయితే, ఇప్పుడు సమస్త వ్యవస్థల పనితీరూ కలుషితం కావడానికి బాధ్యత.... ఇప్పటి ‘ప్రజా ప్రతినిధి’గా ఎన్నికైన, ఎన్నికయ్యే వారిలో లేదు.

సకల ఆరాచకాలకూ నిలయంగా విలసిల్లేవారు చట్ట సభలకు ఎన్నికవ్వడానికి వీలు కల్పించే ఎన్నికల చట్టం... ఆ చట్టం ప్రకారం ఎన్నికలు నిర్వహిస్తున్నట్టు కనిపించే కేంద్ర ఎన్నికల సంఘం అనుసరించే పద్ధతుల్లో లోపం ఉంది.

దొంగలు, హంతకులు, రేపిష్టులు, కబ్జా కోరులు, సమస్త ఆర్థిక, సామాజిక, రాజకీయ అక్రమార్కులు ఎన్నికల్లో పోటీ చేయడానికి మాకేమీ అభ్యంతరం లేదని ఎన్నికల సంఘం ముసిముసి నవ్వులు నవ్వుతూ కాలక్షేపం చేసినంత కాలం.... చట్ట సభలకు వాళ్ళు ఎన్నిక కాకుండా ఎందుకుంటారు? వ్యవస్థలు.... అటువంటి వారి అడుగులకు మడుగులొత్తకుండా ఎందుకుంటాయ్? సమాజం శిధిలం కాకుండా ఎందుకు ఉంటుంది?

తెలుగులో ఓ సామెత ఉంది, “గోచీ! గోచీ! నీ వాసనేంటే ఇలా ఉంది?” అన్నాడట, వెనకటికి ఒకడు. “మరి నేనుండే తావు (చోటు) ఏమిటీ?” అన్నదట ఆ గోచీ.

యధా నాయకా.... తధా వ్యవస్థలు కదా!

ఒకసారి నేర చరితులు ‘ప్రజా ప్రతినిధి’ అవతారం ఎత్తిన తరువాత... “వామ్మో! అక్కడా ఘోరం జరిగిపోయింది. ఇక్కడీ ఘోరం జరిగి పోయింది...” అంటూ శోకండాలు పెట్టి సుఖం ఏముంటుంది.

“వాళ్ళు పట్టించుకోవడం లేదు...., వీళ్ళు పట్టించుకోవడం లేదు...” అని ఏడుపు పెడబొబ్బలు పెట్టినా అంతకంటే సుఖం లేదు.

కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు, ముంబై నుంచి అసోమ్ వరకు నేరచరితులు.... “ప్రజా ప్రతినిధి” అవతారం ఎత్తిందే ‘అందుకు’ కదా!

దేశ వ్యాప్తంగా 29 రాష్ట్రాలు, రెండు కేంద్ర పాలిత ప్రాంతాల్లో నాలుగు వేలకు పైబడి శాసన సభ్యులు ఉంటే... వారిలో 44 శాతం మంది శాసన సభ్యులపై క్రిమినల్ కేసులు ఉన్నాయని “అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్(ఏడీఆర్) అనే






సామాజిక సేవా సంస్థ నిర్వహించిన ఒక అధ్యయనంలో తేలింది. హత్యలు, హత్యా ప్రయత్నాలు, మానభంగాలకు సంబంధించిన నేరారోపణలు ఉన్న వారు కూడా “ప్రజా ప్రతినిధులు”గా వెలిగి పోతున్నారు. వారు 28శాతం మంది ఉన్నారు. అంటే, నాలుగు వేల మంది శాసనసభ్యుల్లో వెయ్యి మంది అన్న మాట.

మరి, దేశంలో చట్టాలు, జీవోలు వారి మైండ్‌సెట్‌కు అనుగుణంగా జారీ కాకుండా... ఎవరి కోసం జారీ అవుతాయి?

అందుకే, సమాజంలో మనం ఇప్పుడు చూస్తున్న సమస్త వ్యవస్థల సర్వ అరాచక, అక్రమ, ఆందోళనకర భ్రష్టత్వ నడవడికలకు మూల కారణం..... రాజకీయ నాయకులుగా చలామణి అవుతున్న వారిలో మాత్రమే లేదు.

వారు... ఆ స్థానాలను ఆక్రమించుకోడానికి ఉపకరించిన భారత ఎన్నికల సంఘం అనుసరించే నిబంధనల్లో ఉంది.

ఎన్నికలలో పోటీచేసే అభ్యర్థి, తన నామినేషన్ పత్రాలతో పాటు తన/ కుటుంబ సభ్యుల ఆస్థిపాస్తులు, తన నేర చరిత్రను అఫిడవిట్ల రూపంలో ఇప్పుడు వేయాల్సి ఉంటుంది.

అలాగే, ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు దాఖలు చేసే పలు రకాల అఫిడవిట్లకు జతగా.... ఎన్నికల సంఘం మరో అఫిడవిట్ ప్రవేశపెట్టాలి.



పంచాయతీ వార్డు మెంబెర్ పదవి నుంచి పార్లమెంట్ సభ్యత్వ పదవి వరకు – పోటీచేసే అభ్యర్థి నుంచి “నాకు వివాహేతర లైంగిక సంబంధం (సంబంధాలు) లేదు(వు)” అనే అఫిడవిట్‌ను ఎన్నికల సంఘం తీసుకోవాలి. ఎన్నికలలో పోటీ చేయదలచిన ప్రతి అభ్యర్థి దాఖలుచేసే ఈ అఫిడవిట్‌ను ఎన్నికల సంఘం ఇతర అఫిడవిట్లను ఆమోదించినట్టే ఆమోదిస్తుంది.

రేపు, ఎన్నికైన తరువాత.... ఫలాన ఎన్నికైన అభ్యర్థికి... “ఇదిగో అక్రమ సంబంధం” అని ఎవరో కోర్టులో పిటిషన్ దాఖలు చేస్తే..., అది నిజమే అని రుజువైతే.... సభ్యత్వం రద్దు చట్టం తన పని తాను చేసుకుపోతుంది కదా!. ఈ తతంగం అంతా – కోర్టులో ఫిర్యాదు చేసిన ఏడాదిలోగా పూర్తి కావాలి.

ఈ ఫిర్యాదుల విచారణను హైకోర్టు పరిధి నుంచి తప్పించి, “ప్రజా ప్రతినిధుల” ప్రత్యేక కోర్టు విచారణ పరిధిలోకి తీసుకువస్తే ఇవి త్వరితగతిన విచారణకు నోచుకుంటాయి. లేకపోతే, తీర్పు వచ్చేలోపు...అక్రమంగా ఎన్నికైన అభ్యర్థుల పదవీ కాలం విజయవంతంగా ముగిసిపోతుంది.

ఇది ఎందుకు?

అక్రమ సంబంధాలు... లేదా వివాహేతర సంబంధాలు కలిగి ఉండడం ఇండియన్ పీనల్ కోడ్ ప్రకారం నేరం ఏమీకాదు. కానీ, నైతిక ప్రవర్తనకు సంబంధించిన అంశం.

మరి, నేరాలు... ఆస్తులు కలిగి ఉండడం కూడా నేరం కాదు. కానీ, ఒక అభ్యర్థి గుణగణాలను రేఖామాత్రంగా అయినా ఓటర్లు అంచనా వేయడానికి ఈ వివరాలు ఉపకరిస్తాయి అనేది సుప్రీం కోర్టు ఉద్దేశం. అందుకే ఈ అఫిడవిట్లను ప్రవేశపెట్టారు.

ఈ వివరాలు కూడా అభ్యర్థి నైతిక ప్రవర్తనను సూచిస్తాయి.

మన ‘ప్రజా ప్రతినిధి’ వ్యవస్థ ప్రక్షాళనకు ఇప్పుడున్న అఫిడవిట్లు సరిపోవడం లేదు కనుకనే, కొత్త అఫిడవిట్‌ను ప్రవేశపెట్టే అంశాన్ని ఎన్నికల సంఘం ఆలోచించాలి.

ఎందుకంటే...!

వివాహ వ్యవస్థకు ఒక పవిత్రత ఉంది. ఎంతటి అరాచకవాదినైనా పౌర సమాజం పట్టించుకోదు గానీ, అక్రమ సంబంధాలు అనే వాటిని సమాజం హర్షించదు. మొత్తం సమాజం చెవులు కొరుక్కుంటూ ఉంటుంది. రాను రాను....

అన్నిరంగాలలోనూ “అక్రమ...., లేదా వివాహేతర లైంగిక సంబంధాలు” అనేది ఒక స్టేటస్ సింబల్‌గానూ, బహిరంగ రహస్యంగానూ తయారైనప్పటికీ, ఒక అఫిడవిట్ వేయడానికి చాలా గుండె ధైర్యం కావాలి.

పైపెచ్చు, నామినేషన్ అభ్యర్థి నైతిక ప్రవర్తన, నడవడిక... ఆ ప్రాంతానికి చెందిన వారికి బాగా తెలుస్తుంది.

అందువల్ల, “నాకు ఎటువంటి అనైతిక, అక్రమ, వివాహేతర లైంగిక సంబంధాలు లేవు” అని అఫిడవిట్ వేయడానికి దమ్ము, ధైర్యం కావాలి. మంచి నడవడిక కావాలి.

లేకపోతే, సమాజంలో చులకన అయిపోతారు. అల్లరైపోతారు.

నామినేషన్ వేసే ప్రతి అభ్యర్థి నడవడిక.... స్థానికంగా అందరికీ కరతలామలకం అయి ఉంటుంది.

“నాకు అక్రమ, వివాహేతర లైంగిక సంబంధము(లు) ఏమీలేవు అని అఫిడవిట్ వేయడానికి అభ్యర్థులు ఒకటికి పదిసార్లు ఆలోచించుకోవలసి ఉంటుంది.

ఈ అఫిడవిట్ అనేది.... కాలేజ్ స్థాయి నుంచి మహిళలకు ఒక రక్షణ కవచంలా పని చేస్తుంది.

భవిష్యత్‌లో ప్రజా జీవితంలోకి అడుగుపెడదామనుకునే వారు ఎవరూ మహిళల వైపు కన్నెత్తి చూడడానికి సాహసించరు.

వారి నైతికతను బట్టే వారి కింద పనిచేసే వ్యవస్థల పనితీరు ఆధారపడి ఉంటుంది.

**- భోగాది వేంకట రాయుడు**
bhogadirayudu2152@gmail.com

## 'ఆపరేషన్ టన్నెల్' సహాయక చర్యల్లో..

# శ్రీసిటీ బి-రోలెక్స్ పరిశ్రమ సహకారం అద్భుతం





ఉత్తరాఖండ్‌లోని సిల్క్యారీ సొరంగంలో చిక్కుకున్న 41 మంది కార్మికులు నవంబరు 28వ తేది రాత్రి సురక్షితంగా బయటపడిన సంఘటన దేశమంతా సంతోషం నింపింది. ప్రశంసనీయ సమిష్టి కృషిఫలితంగా బాధితులు బయటపడ్డారు. ఎంతో క్లిష్టమైన పరిస్థితుల్లో 17 రోజుల పాటు అవిశ్రాంతంగా సాగిన పలుసంస్థల సంయుక్త సహాయక చర్యల్లో భాగంగా శ్రీసిటీలోని బి-రోలెక్స్ పరిశ్రమ అద్భుతమైన సాంకేతిక సహకారం అందించడం విశేషం. రెస్క్యూ పనులు సాగుతున్న కీలక దశలో నవంబర్ 25న డ్రిల్లింగ్ యంత్రం విరిగి ముందుకు కదలక సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొన్న తరుణంలో, తగు పరిష్కారం కోసం పర్యవేక్షక అధికారులు డిఆర్‌డీఓ మాజీ ఛైర్మన్ డాక్టర్ సతీష్‌రెడ్డిని కోరగా, ఆయన వివిధ నిపుణుల ఏజెన్సీలను సంప్రదించారు. ఆయన పిలుపుకు వెంటనే స్పందించిన బి-రోలెక్స్ మేనేజింగ్ డైరెక్టర్ వై.శ్రీనివాస్‌రెడ్డి, డ్రిల్లింగ్‌కు పరిష్కారమార్గంగా ప్లాస్మా ఆధారిత కట్టింగ్‌ను అత్యంత ప్రభావవంతమైన పద్ధతిగా ప్రతిపాదించారు. అలాగే మూడు గంటల వ్యవధిలోనే రెండు పోర్టబుల్ ప్లాస్మా కట్టింగ్ మెషీన్‌లను బి-రోలెక్స్ సిద్ధం చేసింది. వీటితో పాటు, ప్లాస్మా కట్టర్లను వినియోగించే పరిశ్రమకు చెందిన ముగ్గురు సభ్యుల నిపుణుల బృందాన్ని (సంతోష్ కుమార్, అజయ్‌షా, నాగరాజు) ఘటన స్థలానికి పంపారు. ప్లాస్మా కట్టర్‌లతో పాటు నిపుణుల బృందాన్ని పంపడానికి ప్రభుత్వం ప్రత్యేక ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ విమానాన్ని ఏర్పాటు చేసింది. విజయవంతంగా కట్టర్ నిపుణులు పైప్‌లైన్‌ను సిద్ధం చేసి, కొన్ని గంటల వ్యవధిలో సహాయక చర్యలకు అడ్డుపడిన యంత్రపు ముక్కలను తొలగించారు. ఇలా..వేగంగా స్పందించడంతో పాటు సహాయక చర్యలకు నిపుణుల బృందాన్ని పంపిన బి-రోలెక్స్ ఎం.డీ శ్రీనివాస్‌రెడ్డిని శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి అభినందించారు. బి-రోలెక్స్ సమకూర్చిన ప్లాస్మా కట్టింగ్ మెషీన్‌లు, సహాయక చర్యల్లో ముఖ్యమైన అడ్డంకిని అధిగమించడంలో, 800మి.మీ వ్యాసం కలిగిన పైపును ముందుకు తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషించాయి. సహాయక చర్యలు పర్యవేక్షించిన భాస్కర్ కుల్బే మరియు ఉత్తరాఖండ్ ప్రభుత్వ అధికారులు, తన వినూత్న ఆలోచనలతో సాయమందించిన శ్రీనివాస్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.









జననం : 1920

నిర్యాణం : 2018

5వ వర్ధంతి

మా ఇంటి దీపం.. ప్రేమానురాగాల ప్రతిరూపం

శ్రీ ఆదాల శంకరరెడ్డి గారు

పరమపదించి తేది.07.12.2023 నాటికి ఐదేళ్ళు
గడవనున్న సందర్భంగా ఆ పుణ్యమూర్తిని స్మరించుకుంటూ...

వారి పవిత్ర ఆత్మ శాంతికై ప్రార్థిస్తూ...

కుమారులు :

ఆదాల ప్రభాకర్‌రెడ్డి
పార్లమెంటు సభ్యులు, నెల్లూరు

ఆదాల మురళీకృష్ణారెడ్డి
ఛైర్మన్, MAK గ్రూప్

కుమార్తెలు :

గునుపాటి శ్యామల
బిరుదవోలు జలజ

మనుమలు :

ఆదాల వంశీకృష్ణారెడ్డి
ఆదాల దామోదర్‌రెడ్డి


Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com